# రథసారథి

దినపత్రిక

Right direction for the society

వెల:రూ.5/–

హైదరాబాద్ (తేదీ) 07-09-2026 (వారం) సోమవారం సంపుటి: 01|| సంచిక:97 || పేజీలు–8 RATHA SARATHI DINA PATRIKA




## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా విధ్వంసమే

- పాలించడం చేతకాకే నాపై అనుచిత వ్యాఖ్యలు
- సాగునీటి కోసం మరో యుద్ధం.. నేనే నేతృత్వం వహిస్తా
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ప్రజల వద్దకెళ్దాం
- భూమాఫియాతో ప్రజలకు ఇబ్బందులు
- ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీ, మండలిలో గట్టిగా నిలదీయాలి
- భారాస ఎల్పీ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

రథసారథి న్యూస్ హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్ అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోందని, ఏమీ చేయలేక తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమై అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు

మిగతా 2లో


## అందరి గురి

# 22ఏ పైనే

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- 4-6 రోజులు కొనసాగే అవకాశం
- వెయ్యిరోజుల పాలనలో అభివృద్ధిపై వివరించనున్న ప్రభుత్వం
- నిషేధిత అస్త్రంతో విపక్షాలు.. తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్న సర్కారు
- హామీల వైఫల్యాలు ఎజెండాగా ఢీకొట్టనున్న భారాస, భాజపా
- నేడు సెంట్రల్ హాల్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

రథసారథి న్యూస్ హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వాడీవేడి చర్చలు జరగనున్నాయి. వెయ్యి రోజుల ప్రజాపాలనలో సాధించిన విజయాలను ఘనంగా చాటిచెప్పేలా ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సంక్షేమం, అభివృద్ధిపై అంశాల వారీగా వివరించనున్నట్లు తెలుస్తోంది.

మిగతా 2లో





## 22ఏ సమస్య ఎందుకొచ్చింది?

- ఆరా తీసిన ముఖ్యమంత్రి
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలపై అధికారులతో సమావేశం

రథసారథి న్యూస్ హైదరాబాద్: భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. “గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి’ అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొంటూ.. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయి..

మిగతా 2లో

### ఈజిప్టులో భారత వైమానిక దళం ‘సారంగ్’ విన్యాసాలు



05

- ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో పాల్గొననున్న బృందం
- ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో విన్యాసాలు చేసే ఏకైక జట్టు

### 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

- దేశవ్యాప్తంగా సమన్వయ వ్యూహం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి




2

### ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్

- ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని వెల్లడి
- అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- రెండు సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు కల్పించామని స్పష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 6, (రథసారథి న్యూస్ ): ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు.



మిగతా 2లో



5

### ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

### అనుచిత భాష వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాలా?

- ముఖ్యమంత్రిగానే ఆయన సభలో అడుగుపెడతారు
- అసెంబ్లీ నెల రోజులు నిర్వహించాలి
- భారాస ఎల్పీ సమావేశ వివరాలను వెల్లడించిన హరీశ్‌రావు



5

### ఢిల్లీలోని సత్యనికేతన్‌లో కుప్పకూలిన భవనం..



- ఐదుగురు విద్యార్థులు మృతి
- ఐదు అంతస్తుల భవనం కుప్పకూలి.. పెను విషాదం
- శిథిలాల కింద విద్యార్థులు.. ముమ్మరంగా రెస్క్యూ
- బేస్‌మెంట్ పనుల వేళ.. ఒక్కసారిగా కూలిన భవనం
- 50 మంది విద్యార్థులు ఉన్నారనే అనుమానం.. కొనసాగుతున్న గాలింపు

5

### బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం

- బీహార్‌లోని ఔరంగాబాద్‌లో దారుణ ఘటన
- బస్సు కోసం వేచి చూస్తుండగా అపహరణ



02

### మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

- బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు
- సోషల్ మీడియా ట్రోలింగ్‌పై డీజీపీ వైఖరిని ప్రశ్నించిన కవిత

5



మొదటి పేజీ తరువాయి

## 22ఏ సమస్య ఎందుకొచ్చింది?



రథసారథి న్యూస్ హైదరాబాద్: భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ''గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొంటూ.. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయి.. ఏ మేరకు పరిష్కరించామనే వివరాలను కూడా ఆయన సీఎంకు తెలిపారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య కనిపించిందని.. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని ఆదేశించారు. సమావేశానికి పలువురు కలెక్టర్లు హాజరయ్యారు.


మంత్రి పొంగులేటి సమీక్ష

నిషేధిత భూముల జాబితా అంశం శాసనసభ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్తులు కూడా ఆ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి, కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది సభలో మంత్రి వివరించనున్నట్లు తెలిసింది. ఆదివారం ఈ అంశాలపై మంత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారు. 22ఏ జాబితాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఆ జాబితాలో ఉన్నాయంటూ పలుచోట్ల భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించారు. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 980 వచ్చాయి. వీటి పరిష్కారానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల కార్యదర్శులతో ప్రభుత్వం హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శాసనసభలో విపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది. సభ్యులు 22ఏ సంబంధిత ప్రశ్నలు వేస్తే వాటికి సరైన జవాబు అందించే విధంగా జిల్లాల వారీగా పూర్తి సమాచారాన్ని తెప్పించింది.

పట్టాల పంపిణీపైనా..

రాష్ట్రంలో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు లేని రైతులకు ఇటీవల పట్టాలు పంపిణీ చేశారు. సమీక్షలో ఈ అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ఇటీవల సూర్యాపేట జిల్లా నూతన్‌కల్‌లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లా నారాయణపురంలో 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు పట్టాలు అందజేయగా.. భద్రాద్రి, ములుగు జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టాల్సి ఉండటంపై సమీక్షించినట్లు తెలిసింది. ఇదే తరహాలో ఇతర జిల్లాల్లో కూడా ఏళ్ల తరబడి హక్కులు రాని భూముల వివరాలను సిద్ధం చేసి సర్వే చేపట్టాలని కూడా రెవెన్యూ శాఖను మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

## బాలికను కిడ్నాప్ చేసి
## సామూహిక అత్యాచారం



**ఔరంగాబాద్ (బీహార్), సెప్టెంబర్ 6, (రథసారథి న్యూస్ ):** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లాలో ఓ బాలికపై జరిగిన కిడ్నాప్, సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి, సోదరిని చూసేందుకు నగరానికి వెళ్లేందుకు బాధిత బాలిక ఇంటి నుంచి బయలుదేరింది. బస్సు కోసం రోడ్డుపై వేచి చూస్తున్న సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. సంఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఓ కారు అక్కడికి చేరుకుని ఆగిందని తెలుస్తోంది. ఎక్కడికి వెళ్తున్నావంటూ మాట్లాడిన ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె చేతులు, కాళ్లు కట్టేసి నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లినట్లు బాధితురాలు వాంగ్మూలంలో పేర్కొన్నట్లు సమాచారం. అపహరణ అనంతరం బాలికను భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనను వదిలిపెట్టాలని బాధితురాలు వేడుకున్నప్పటికీ వారు కనికరం చూపలేదని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ఘటన అనంతరం నిందితులు ఆమెను మరో ప్రాంతంలో వదిలేసి, జరిగిన విషయం ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించినట్లు బాధితురాలు తెలిపినట్లు సమాచారం. బాధితురాలు సురక్షితంగా బయటపడిన అనంతరం కుటుంబ సభ్యులకు, పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది.దర్యాప్తు సందర్భంగా బాధితురాలు వెల్లడించిన కొన్ని అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులు గతంలో కూడా పలువురిపై నేరాలకు పాల్పడినట్లు చెప్పారని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ వాదనల నిజానిజాలను పోలీసులు ఇంకా నిర్ధారించాల్సి ఉందని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అధికారిక దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, బాలికల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని వివరాలను సేకరిస్తున్నామని, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# అందరి గురి 22ఏ పైనే

రథసారథి న్యూస్ హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వాడీవేడి చర్చలు జరగనున్నాయి. వెయ్యి రోజుల ప్రజాపాలనలో సాధించిన విజయాలను ఘనంగా చాటిచెప్పేలా ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సంక్షేమం, అభివృద్ధిపై అంశాల వారీగా వివరించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల దుమారం లేపిన 22ఏ భూముల వ్యవహారంపై ప్రధానంగా అసెంబ్లీలో చర్చించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమవుతోంది. ఇదే విషయంపై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండడంతో.. విపక్షాల విమర్శలు, ఆరోపణలకు దీటుగా సమాధానమిచ్చేలా సర్కారు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం భారాస సహా భాజపా కూడా ఇదే అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తుండడంతో.. భూముల వ్యవహారంపైనే అవసరమైతే రెండు రోజులు చర్చించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను ప్రధాన ఎజెండాగా భారాస, భాజపా చర్చకు సిద్ధమవుతున్నాయి. తొలిరోజు సమావేశాల ప్రారంభానికి ముందు కొత్తగా నిర్మించిన 'సెంట్రల్ హాల్'ను సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారు. దీనికి మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరుపెట్టారు. ఈ కార్యక్రమం అనంతరం శాసనసభ, మండలి ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. తొలిరోజు ఇరుసభల్లోనూ ప్రశ్నోత్తరాలను నిర్వహించనున్నారు. 'తెలంగాణ సమగ్ర శిక్షణ'.. 'పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా'.. 'మెట్రో రైలు'కు సంబంధించిన ఆడిట్ రిపోర్టులను సభ ముందుంచుతారు. అనంతరం ఉభయ సభలు వాయిదా పడతాయి. తర్వాత శాసనసభ, మండలికి సంబంధించి వేర్వేరుగా 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)' సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో శాసనసభ, శాసనమండలిని ఎన్నిరోజుల పాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చించాలి? అనేది నిర్ణయిస్తారు. ఈ సమావేశాలు సుమారు 4 నుంచి 6 రోజుల పాటు జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చించాల్సిన అంశాల ప్రాధాన్యాన్ని బట్టి సభ నిర్వహణ రోజులను పొడిగించే అవకాశాలుంటాయి.



### నేడు సీఎల్పీ సమావేశం

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల విమర్శలను వాస్తవిక సమాచారం, దీటైన సమాధానాలతో ఎదుర్కోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని అసెంబ్లీ వేదికగా తిప్పికొట్టాలని రంగం సిద్ధం చేస్తోంది. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విడిగా కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం కూడా జరిగే అవకాశాలున్నాయని పార్టీవర్గాలు వెల్లడించాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారని నేతలు తెలిపారు. ప్రధానంగా 22ఏ భూముల అంశంపై అసత్య ప్రచారం ఎక్కువగా చేస్తున్నారని, భారాస పాలనలోనే ఇది ఉందనే విషయాన్ని ఆధారాలతో సహా సభలో చెప్పాలని ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైన సందర్భంగా ఇప్పటివరకూ చేపట్టిన సంక్షేమ పథకాలు, వాటివల్ల ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు, నిధుల వినియోగంతో పాటు.. సాధించిన విజయాలు తదితర అంశాలను సమగ్రంగా శాసనసభ ద్వారా ప్రజలకు తెలపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలను పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా పేదలందరికీ ఇస్తున్న వైనాన్ని ప్రముఖంగా చెప్పాలని కాంగ్రెస్ వ్యూహాలు సిద్ధం చేస్తోంది.

### అన్ని వర్గాలకూ మోసం.. నినాదంతో భారాస

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తవుతున్నా.. అన్ని వర్గాల ప్రజలకు తీరని ద్రోహమే జరిగిందని, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను ఈ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందనే నినాదాన్ని అసెంబ్లీ, మండలిలో బలంగా వినిపించాలని భారాస నిర్ణయించింది. ప్రజాసమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెలరోజుల పాటు సమావేశాలు నడపాలని డిమాండ్ చేయనుంది. సాగునీటి ప్రాజెక్టులు, 22ఏ భూముల నిషేధం వ్యవహారం, నిరుద్యోగులు, విద్యార్థులు, తదితర అంశాలపై చర్చించేందుకు భారాస సన్నద్ధమవుతోంది. నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గళమెత్తనున్న భాజపా నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని భాజపా సభ్యులు నిర్ణయించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాతో రైతులు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కాక ఆర్థికంగా కుదేలవుతున్నారని, ఆరు గ్యారంటీలను నెరవేర్చలేదని ఈ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని పార్టీ శాసనసభాపక్షం నిర్ణయించింది. కనీసం 15 రోజులపాటు సభను నిర్వహించాలని భాజపా సభ్యులు డిమాండ్ చేయనున్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా విధ్వంసమే

రథసారథి న్యూస్ హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్ అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోందని, ఏమీ చేయలేక తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమై అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పాలన చేతకాకే తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతంగా పోరాటం చేయాలని, కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై ప్రజల వద్దకు వెళ్దామన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, సాగునీటి కోసం మరో యుద్ధానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. లక్షల మందితో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని, ఆ జల ఉద్యమానికి తానే నేతృత్వం వహిస్తానని స్పష్టం చేశారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా నిలదీయాలని, సమావేశాల్లో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని సూచించారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ప్రజల ఎజెండానే భారాస ఎజెండాగా ఉండాలని వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందన్నారు.



కాళేశ్వరంపై కుట్రలు తేలిపోయాయి

''తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టులపై చేసినవి దుష్ప్రచారాలే అని.. కుట్రపూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైపోయింది. మేడిగడ్డ దగ్గర చిన్న మరమ్మతు చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే.. దాదాపు 13 జిల్లాల్లో రైతాంగం పంటలు పండించుకుంటారు. మరి ఎందుకు ఆ ప్రయత్నం చేయట్లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలి? భారాస హయాంలో 90% పూర్తయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా.. ఉమ్మడి నల్గొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు సాగునీరు, తాగునీటిని ఎందుకు అందించలేకపోతున్నారు?

అన్ని అంశాలపై ప్రజల పక్షాన ప్రశ్నించాలి

వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలను, హామీలను వెయ్యి రోజులైనా నెరవేర్చడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందో ప్రజల పక్షాన ప్రశ్నించాలి. పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా.. పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లల వివాహాలు, దవాఖానా ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తమ భూమిని అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు గోసపడుతున్నారు. పాలిటెక్నిక్ విద్యను భ్రష్టుపట్టించేలా తీసుకొచ్చిన జీవో నం.97పై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి. తొలిఏడాదే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. యువత ఆందోళనకు మద్దతుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఫ్యూచర్ సిటీ పేరిట ప్రభుత్వం నిర్వహిస్తోన్న రియల్ ఎస్టేట్ దందాను అసెంబ్లీ వేదికగా నిలదీయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, సింగరేణి కుంభకోణాలు, మెట్రోరైలుపై అనాలోచిత నిర్ణయాలు, ఇష్టారీతిన ప్రభుత్వ భూముల అమ్మకాలు, గురుకులాల్లో సమస్యలు, శాంతిభద్రతలు అదుపు తప్పడం, ఉద్యోగులు, పింఛనుదారుల ఇబ్బందులు, తదితర అంశాలపై ఎండగట్టాలి'' అని కేసీఆర్ పేర్కొన్నారు. ''తెలంగాణకు భాజపా చేసింది, చేస్తున్నది శూన్యం. దిల్లీలో జెన్ జీ ఆందోళన ప్రభావం ఆ పార్టీపై చాలా పడింది. దాన్ని అధిగమించేందుకు నియోజకవర్గాల పునర్విభజన చేస్తుంది. భాజపా వ్యతిరేక వైఖరిని కూడా గట్టిగా వినిపించాలి'' అని కేసీఆర్ సూచించారు.

మీరు సభకు రానవసరం లేదు సర్!

కేసీఆర్‌కు ఎమ్మెల్యేల వినతి

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని.. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సీఎం సహా కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శల అంశం భారాస ఎల్పీ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. ''సభల్లో సమస్యలపై చర్చ చేయడం లేదు. తిట్లనే నమ్ముకున్నారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇంత అనుచిత వ్యాఖ్యల దుస్థితి ఎప్పుడూ లేదు. అలాంటి సభకు మీరు రానవసరం లేదు'' అని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

# ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 6, (రథసారథి న్యూస్ ): ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రతిపక్ష నాయకుడి హోదాను అపహాస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి చివరకు నిరాశపరిచారని ఆయన ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య రంగాన్ని కూడా గత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకే పరిమితం చేసిందని విమర్శించారు. విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని కేటీఆర్‌కు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో లక్షా 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికే 70 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని అన్నారు.



కుల సర్వే నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని తెలిపారు. గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గద్దర్ పేరిట అవార్డులు ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల హక్కేనని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పులు ఎత్తిచూపితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

(రథసారథి న్యూస్ ) పణజి: డ్రగ్స్ రహిత యువశక్తితోనే 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యసాధన సాధ్యమని ప్రధాని విశ్వసిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రధాని సంకల్పం మేరకు 2029 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రోడ్‌మ్యాప్ సిద్ధం చేసిందని తెలిపారు. నక్సలిజం, ఉగ్రవాద ముప్పును అంతం చేయడానికి మోదీ సర్కార్ ఎంతగానో కృషి చేసిందని, అదే తరహాలో 'అభివృద్ధి చెందిన భారత్' అనే స్వప్నాన్ని సాకారం చేసేందుకు కట్టుబడి ఉందని వివరించారు.

ఇందులో భాగంగానే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా సమన్వయంతో కూడిన వ్యూహాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలియజేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం గోవాలోని పణజిలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి అమిత్ షా అధ్యక్షత వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు.

2014కు ముందు డ్రగ్స్‌పై పోరాటం చాలావరకు ఒంటరిగానే సాగిందన్నారు. దర్యాప్తు ఏజెన్సీలు తరచుగా చిన్నపాటి నిందితులను పట్టుకోవడంతోనే సంతృప్తి చెందేవని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ ప్రాధాన్యత గల అంశంగా పరిగణిస్తోందని స్పష్టంచేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై సమన్వయంతో కూడిన చర్యలను చేపట్టేందుకు 2019లో కార్యనిర్వాహక, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 'మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక జాతీయ సమన్వయ కమిటీ' అనే నాలుగు అంచెల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశం అనంతరం బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, బీఆర్ఎస్ పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాడుతూ, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాలని కేసీఆర్ సూచించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పనిచేసేందుకు నాయకులు, ఎమ్మెల్యేలు సమష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.






## హామీల అమలుకు బీఆర్ఎస్ నిరసన

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అమలు కానివాటిని ప్రజలకు వివరించారు. గ్రామానికి రావాల్సిన పెండింగ్ హామీలను గుర్తు చేస్తూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ జిల్లా డైరెక్టర్ నగేష్ కురుమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్న రెండేళ్ల పదవీకాలంలో హామీలన్నింటినీ నెరవేర్చాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నరేష్‌గౌడ్, సీహెచ్ బాబూజీ, దండే నవీన్, మల్లగారి యోహాన్, మన్నె మధు, కొత్తగొల్ల మల్లేశం, సోలాపూర్ శంకర్, దుర్గం పోయిని పెద్ద పోచయ్య, కుద్దెగారి సలీం, కవిలే యాదగిరి, బరురి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉద్యమిస్తేనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం !




**జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**
**జర్నలిస్టులకు క్రమశిక్షణ చాలా అవసరం :**
**రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్**
**- నారాయణఖేడ్‌లో టీయూడబ్ల్యూజే–ఐజేయూ సర్వసభ్య సమావేశం**



నారాయణఖేడ్ ప్రతినిధి సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): :జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని, ఐక్యంగా ఉద్యమిస్తామని టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, సంఘం బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి జిల్లా కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా చూడడంతో పాటు ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులకు సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణతో పాటు మండల స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేయాలని సూచించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. పైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమన్నారు. సమస్య ఏ ఒక్క జర్నలిస్టుదైనా యూనియన్ సమస్యగా భావించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొని స్థానిక సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రతినిధి బాసిత్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్,
జిల్లా ప్రధాన కార్యదర్శి రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులు
శ్రీనాథ్ మతీన్,ఆర్ సత్యనారాయణ రెడ్డి, మల్లేశం,
జాయింట్ సెక్రటరీలు ఉల్లిగడ్డల శివకుమార్ , శ్రీనివాసరెడ్డి ,,ఎంఏ రవూఫ్
ఆర్గనైజింగ్ సెక్రటరీలు విలాస్ విల్సన్ ,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆసిఫ్, ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్,
చిన్న , మధ్య తరహా పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి చవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడు నజీర్,
సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థుల భాగస్వామ్యం అవసరం



**పెద్దచెల్మెడలో తల్లిదండ్రుల సమావేశం**

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): మునిపల్లి మండలంలోని పెద్దచెల్మెడ గ్రామంలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు సంతోషికుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు, జేఏసీ సహ కన్వీనర్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో గ్రామస్థులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు చొరవ చూపాలని సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రధానంగా లాభాపేక్షతో పనిచేస్తాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ప్రజల చొరవతోనే మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం 20 శాతం నిధులు కేటాయిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సంతోషికుమారి మాట్లాడుతూ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. తమ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాచార, ప్రసార సాంకేతికత ఆధారిత బోధన అందించే ఉపాధ్యాయులు కూడా ఉన్నారని వివరించారు. పెద్దచెల్మెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.1.62 కోట్లు మంజూరు చేయించడంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకరించారని, ఇందుకు స్థానిక సర్పంచ్ రాధాబాయి బాలకృష్ణ పంతులుకు ప్రధానోపాధ్యాయురాలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. జిల్లా సహాధ్యక్షురాలు మానస మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిచోటా లభించదని పేర్కొన్నారు. స్థానిక నాయకుడు బాలకృష్ణ పంతులు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో నూతన పాఠశాల భవనానికి నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పదో వార్డు సభ్యుడు రాజు మాట్లాడుతూ ఉచిత పథకాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని మొదటి నుంచీ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గ్రామస్థులను సమీకరించడంలో కీలకపాత్ర పోషించిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం దుర్గయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబా, వార్డు సభ్యులు శ్రీధర్, రవి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మునిపల్లి మండల కార్యదర్శి రవీందర్, ఉపాధ్యాయులు సూరజ్, ఎస్ఎంఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు నరేంద్ర, బాలరాజ్, ప్రశాంత్, అశోక్, దినకర్, వికాస్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



## కంది గ్రామ సమస్యలపై బీఆర్ఎస్ నిరసన

**-పల్లెల్లో విధ్వంసం–పడకేసిన పారిశుద్ధ్యం పేరుతో ఆరవ రోజు కార్యక్రమం**

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు పిలుపు మేరకు కంది గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఆరవ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేస్తూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై వివరించారు. ఈ సందర్భంగా కంది గ్రామంలోని పలు సమస్యలను నాయకులు ప్రస్తావించారు. శంకర్‌పల్లి రోడ్డు నుంచి కంది మీదుగా కాశీపూర్ రోడ్డు వరకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై వీధి దీపాల్లో అనేకం వెలగడం లేదని ఆరోపించారు. కాలిపోయిన దీపాల స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేసి రహదారిని వెలుగులతో నింపాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలోని హైమాస్ట్ దీపాలు పనిచేయని ప్రాంతాల్లో కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కంది గ్రామంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, సుమారు 500 వరకు వీధి కుక్కలు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని నాయకులు తెలిపారు. కంది మండల కార్యాలయానికి, గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు, స్నానపు గదుల వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రజలకు అవసరమైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కంది గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన రూ.5ల నీటి శుద్ధి కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని, పల్లె ప్రకృతి వనం నిర్వహణను మెరుగుపరిచి పరిశుభ్రంగా ఉంచి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త కోసం వేర్వేరు చెత్త బుట్టలను అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పాలకవర్గం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా దోమల సమస్య పరిష్కారం కాలేదని నాయకులు ఆరోపించారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా మందు పిచికారీ చేయడంతో పాటు గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గం విఫలమైతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంది గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు వడ్ల రవికుమార్, నాయకులు కే. ఆనందరావు, కరీంఖాన్, పి. కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంఘటితంగా ఉండి ఆర్యవైశ్యుల సంక్షేమానికి పాటుపడాలి



**సంఘటితంగా ఉండి ఆర్యవైశ్యుల సంక్షేమానికి పాటుపడాలి**
**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కృష్ణ**

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండి తమ సంక్షేమంతో పాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా నామ రవికిరణ్ గుప్తా బాధ్యతలు స్వీకరించడంతో పాటు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తోపాజి అనంత కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రాజకీయ రంగంలోనూ సముచిత ప్రాతినిధ్యం సాధించేందుకు ముందుకు రావాలని సూచించారు. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ ఆర్యవైశ్య సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో జహీరాబాద్ ఆర్యవైశ్యులు విశేష సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆర్యవైశ్యులు సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారని అన్నారు. ఆర్యవైశ్యులు ఉన్న ప్రతి ప్రాంతంలో అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు నిర్మించడం, దేవాలయాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి ప్రతి కార్యక్రమంలోనూ ఆర్యవైశ్యుల సహకారం కీలకంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఆర్యవైశ్యుడు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, అదే స్ఫూర్తితో జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం సంఘం అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఆర్యవైశ్య మహిళలు కూడా సంఘటితంగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**-80 సార్లు రక్తదానం చేసిన శ్రీనివాస్‌కు సన్మానం**

సుమారు 80 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావానికి ఆదర్శంగా నిలిచిన ఆర్యవైశ్య సభ్యుడు ప్రొద్దుటూరు శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

**-నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం**

జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా మాడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా బడంపేట్ శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడిగా అకారపు షణ్ముఖ్‌తో పాటు యువజన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బెజుగం శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షులు మునిగాల మాణిక్ ప్రభు, జూకంటి లక్ష్మణ్, రేజింతల్ సిద్ధి వినాయక ఆలయ అధ్యక్షుడు అశోక్ సంగయ్య రేజింతల్, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు భూస శ్రీకాంత్, సదాశివపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కంది కృష్ణ, సంఘం ప్రముఖులు నీలా వెంకటేశం, బెజుగం రాజగోపాల్, బెజుగం రాజయ్య తదితరులు పాల్గొన్నారు. బీదర్, తాండూర్, సదాశివపేట, నారాయణఖేడ్, సంగారెడ్డి, కుంచారం తదితర ప్రాంతాల ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ నిరసన







**-పల్లె విధ్వంసం–పడకేసిన పారిశుద్ధ్యం పేరుతో ఐదో రోజు కార్యక్రమాలు**

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచనలతో ఐదో రోజు పల్లె విధ్వంసం-పడకేసిన పారిశుద్ధ్యం అంశంపై గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గడపకు కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేయకుండా మిగిలిపోయిన హామీల వివరాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. అమలుకాని హామీలు, ప్రజలకు అందని సంక్షేమ పథకాల వివరాలను 'కాంగ్రెస్ బాకీ కార్డుల' ద్వారా ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇస్కాన్ సాగర్ నగర్‌లో ఘనంగా ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు

**(రథసారథి న్యూస్), విశాఖపట్నం (సాగర్ నగర్):**

ఇస్కాన్ సాగర్ నగర్ ఆలయంలో గత నాలుగు రోజులుగా ఎంతో వైభవంగా జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఈ రోజుతో మంగళప్రదంగా ముగిసాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిన్న సాయంత్రం ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి ఆవిర్భావ దినోత్సవాన్ని (నందోత్సవం) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీల ప్రభుపాదుల వారికి ప్రత్యేక గురుపూజ, మహా అభిషేకం అత్యంత భక్తిప్రపత్తులతో జరిగాయి. ఈ వేడుకల్లో ఇస్కాన్ సాగర్ నగర్ ప్రెసిడెంట్ సాంబదాస్ ప్రభుజీ నితైసేవని మాతాజీలు పాల్గొని, శ్రీశ్రీ రాధా గోవిందులకు మరియు శ్రీల ప్రభుపాదుల వారికి స్వయంగా శాస్త్రోక్తంగా అభిషేక సేవలు అందించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ విశేష విందు ప్రసాద వితరణ (మహా ప్రసాదం) గావించారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



## అనుమతులు రాకపోయినా.. జోరుగా ఇండ్ల నిర్మాణాలు

**ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో ఇంటి ప్లానింగ్ లు........**
**సర్వం శ్రీనివాసుడే.....**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6 (రథసారథి న్యూస్)**

పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఏడు వార్డుల్లో ఎక్కడ ఇల్లు కట్టాలన్న బహుళ అంతస్తులు నిర్మించాలన్న ప్రైవేట్ వ్యక్తి అయినటువంటి శ్రీనివాసున్నే సంప్రదించాల్సిందే, సర్వం ఆయనే నడుపుతూ అక్రమ ఇంటి నిర్మాణాలకు తోడ్పడుతూ సచివాలయ సిబ్బందిని తన గుప్పెట్లో పెట్టుకుని, జోనల్ కమిషనర్ కార్యాలయంలో కూడా అధికారుల అండదండలతో చలామణి అవుతూ ఇంటి ప్లానింగ్ అనుమతులకు లక్షల రూపాయల్లో వసూలు చేసి పరోక్షంగా అక్రమ నిర్మాణాలకు సహాయపడుతున్న ఈ శ్రీనివాసుడిపై ఎంతమంది కమిషనర్లు కొత్తగా వచ్చిన ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారంటే ఆయన ఈ విభాగంలో ఎంత ముదురు కాకపోతే ఈ ప్రాంతంలో తన ఒక సామ్రాజ్యాన్ని సృష్టించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఉన్నతాధికారులు మాత్రం నోరు మెదకపోవడంపై మన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈయన అండదండలతోనే ఇంటి నిర్మాణదారులు కూడా రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని మూడు నాలుగు అంతస్తులు నిర్మించడం దానికి సచివాలయ ఇన్చార్జులు కూడా సహకరించడం తో లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు వాదన లు వినపడుతున్నాయి. దీనిలో భాగంగానే 60వ వార్డు ఇందిరా కాలనీలో, 59 వ వార్డు వాయుపుత్ర నగర్ లో అక్రమ నిర్మాణాలు జోరు అందుకుంటున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ వీటిపై దృష్టి సారించి హైదరాబాద్ లో జరుగుతున్న" హైడ్రా"పద్ధతిలో నిర్ణయం తీసుకుని వ్యవహరించినట్లయితే జీవీఎంసీ కి ఆదాయంతో పాటు మంచి పేరు కూడా వస్తుంది.






## ప్రజాసేవకు, నిరాడంబరతకు ప్రతీక నలబోలు గోవిందరాజులు

**నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**

**(రథసారథి న్యూస్), వినుకొండ :**

వినుకొండ మాజీ శాసనసభ్యులు, రైతుల పక్షపాతి, ప్రజల మనిషి స్వర్గీయ నలబోలు గోవిందరాజులు 114వ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా ఈపూరు మండలం, కొండ్రముట్ల గ్రామంలో నలబోలు గోవిందరాజులు కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై, గోవిందరాజులు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. "నలబోలు గోవిందరాజులు అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది వారి నిరాడంబరత, ప్రజా సమస్యల పట్ల వారికున్న అంకితభావం. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ, వారితో కలిసి భోజనం చేస్తూ ఒక నిజమైన ప్రజల మనిషిగా వారి హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఒక నాయకుడి గొప్పతనం ఆయన పదవిలో ఉన్నప్పుడు మాత్రమే కాదు, పదవి లేకపోయినా ప్రజలు ఆయనను ఎంతగా గుర్తుపెట్టుకుంటారనే దానిపై ఆధారపడి ఉంటుంది. వినుకొండ నియోజకవర్గ అభివృద్ధికి, ఇక్కడి రైతు సోదరుల సంక్షేమానికి వారు వేసిన బలమైన పునాదులు ఈనాటికీ ఆదర్శనీయం.

నేడు ఆవిష్కరించిన ఈ కాంస్య విగ్రహం కేవలం ఒక జ్ఞాపకం మాత్రమే కాదు, ఆయన నిబద్ధతకు, ప్రజా సేవకు, ఆశయాలకు ఒక దివ్య ప్రతీక. ఈ మార్గం గుండా వెళ్లే ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా నేటి యువతకు ఆయన జీవితం స్ఫూర్తినిస్తుంది. మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యత.

గోవిందరాజులు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేసిన కార్యక్రమ నిర్వాహకులకు, నలబోలు కుటుంబ సభ్యులకు, అభిమానులకు మరియు వినుకొండ ప్రజలకు.. ఈ సందర్భంగా ఎంపీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ , వినుకొండ ఎమ్మెల్యే & ఏపీ చీఫ్ విప్ జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు , రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ , మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి , పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర , GDCC బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున , ఇతర కూటమి నేతలు, నలబోలు కుటుంబ సభ్యులు మరియు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

- **ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలి**
- **స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి: డీవైఎఫ్ఐ**



సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6: (రథసారథి న్యూస్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఆరోపించారు. నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కొండాపూర్ మండల కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని ఆరోపించారు. నీట్, రైల్వే, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు చోటుచేసుకోవడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు రాష్ట్రాల్లోని ఖాళీలను కూడా తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి నియామక ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చిందని వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్‌తో పాటు పలు హామీలు అమలు కాలేదని విమర్శించారు. సమగ్ర వివరాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగ నియామకాలకు తక్షణమే ప్రకటనలు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి కోసం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కాకుండా, అర్హులైన నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధన కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జయరాజు, మాజీ నాయకుడు అతిమేల మాణిక్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రవాణాపై నిరంతర నిఘా పెట్టి విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల బారినుంచి కాపాడాలని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదని వారు ఆరోపించారు. స్థానిక వనరులను వినియోగించుకుంటున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా కొండాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీవైఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి అనిల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్, నాయకులు ఎం. శ్రీకాంత్, ప్రశాంత్, జె. శ్రీకాంత్, బాబురావు, వాణి, రమేష్, సాయికుమార్, అర్జున్, ప్రజా సంఘాల నాయకులు రాజయ్య, నాగభూషణం, రాజు, నాగరాజుతో పాటు సుమారు 100 మంది యువత పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం...



**(రథసారథి న్యూస్) న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 6**

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమావేశం తిరుపతి పీఎల్ఆర్ కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రులు ఆర్ కె రోజా, నారాయణస్వామిలతో పాటు అన్ని నియోజక వర్గాల ఇన్ చార్జిలతో పాటు పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిచేతుల మీదుగా పార్టీ గుర్తింపు కార్డును డాక్టర్ సునీల్ కుమార్ అందుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గం నుంచి ఏకగ్రీవాలకు అవకాశం లేకుండా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. జగనన్న నాయకత్వంలో ప్రతి నాయకుడు, కార్యకర్తను సమన్వయం చేసుకుని ఎన్నికల్లో పోరాటం చేస్తామని డాక్టర్! ఎం సునీల్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ సిపి పార్టీ ప్రజా ప్రతినిధులు



## 42వ రోజు విజయవంతంగా కొనసాగిన ‘ఇంటింటికీ తెలుగుదేశం–2026’

***1.04 కోట్ల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం***
***నేడు 1,54,454ఇళ్లను సందర్శించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు***

(రథసారథి న్యూస్), అమరావతి : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చడం, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న “ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం” కార్యక్రమం 42వ రోజు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 1,54,454 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1.04 కోట్ల ఇళ్లు సందర్శించారు . ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా, ప్రజా భాగస్వామ్యంతో విస్తృతంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా డాక్టర్. రవితేజకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన సత్కారం

**మాదిగ సమాజానికి గర్వకారణం - అభినందనలు తెలిపిన పలువురు ప్రముఖులు.**



**రేపల్లె సెప్టెంబర్ 06 (రథసారథి న్యూస్)**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును రవితేజకు ప్రధానం చేశారు. రేపల్లె మండలం బేతపూడి గ్రామానికి చెందిన బేతపూడి సత్యం సీతమ్మ జేష్ఠ పుత్రుడు రవితేజ సాధారణ ఉపాధ్యాయుడిగా తన జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించిన రవితేజ కష్టపడి పనిచేసే తత్వం, విద్యార్థుల పట్ల అంకితభావం, సేవా దృక్పథం, బోధనలో నిబద్ధతతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం అభినందనీయమని ఉపాధ్యాయుడి చేతిలో పుస్తకంతో పాటు భవిష్యత్ తరాల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉంటుందని, ఆ బాధ్యతను డాక్టర్ రవితేజ సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని సీఎం. చంద్రబాబు నాయుడు కొనియాడారు. మాదిగ సమాజానికి చెందిన రవితేజ సాధించిన ఈ ఘనత ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. సామాజిక, ఆర్థిక సవాళ్లను అధిగమించి విద్య, ప్రతిభ, కృషితో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన తన విజయంతో నిరూపించారని తెలిపారు. ఈ పురస్కారం వ్యక్తిగత విజయమే కాకుండా సమాజంలోని పిల్లలు చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే స్ఫూర్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రేమ, వారి భవిష్యత్తుపై బాధ్యత, సమాజం పట్ల సేవాభావం రవితేజలోని ప్రత్యేక లక్షణాలని, మంచి ఉపాధ్యాయుడు ఒక తరాన్ని మార్చగలడనే మాటకు ఆయన నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకుని, మరెంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా రవితేజ ప్రతిభను గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డుతో సత్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, సంబంధిత అధికారులకు రవితేజ కృతజ్ఞతలు తెలిపారు. రవితేజ విజయం సమాజానికి గర్వకారణమని, ఆయన సేవలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మార్పీఎస్ నాయకులు బేతపూడి భాస్కరరావు, ఆలూరు భిక్షాలు, బేతపూడి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంఘ నాయకులు దారం సాంబశివరావు, దోవ రమేష్ రాంజీ, మునిపల్లి సుబ్బయ్య, రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వాగోలు బాబురావు, జర్నలిస్టులు రాచాబత్తుని శ్రీనివాసరావు, కనపర్తి వెంకయ్య, తదితరులు రవితేజను అభినందించారు.

# ఢిల్లీలోని సత్యనికేతన్‌లో కుప్పకూలిన భవనం..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 ((రథసారథి న్యూస్): దక్షిణ ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఎంతమంది చిక్కుకున్నారన్నది ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. సుమారు 50 ఏళ్ల నాటి ఈ భవనంలో విద్యార్థుల కోసం బాలుర పీజీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతుండగా మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. షార్ట్ సర్క్యూట్ లేదా నిర్మాణ లోపాలే కాకుండా, కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బేస్‌మెంట్‌లో నీరు చేరి పునాదులు బలహీనపడటమే భవనం కూలడానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. మధ్యాహ్నం 1.33 గంటల సమయంలో భవనం కూలిన సమాచారం ఢిల్లీ అగ్నిమాపక శాఖకు అందింది. సుమారు 1.50 గంటలకు రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని గాలింపు ప్రారంభించాయి. ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ , ఎన్డీఆర్ఎఫ్, ఢిల్లీ ఫైర్ సర్వీసెస్, ఢిల్లీ పోలీస్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ), సివిల్ డిఫెన్స్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. శిథిలాల తొలగింపు, బాధితుల కోసం గాలింపు చర్యల్లో సెర్చ్ అండ్ రెస్క్యూ, బ్రీతింగ్ అపరేటస్, వాటర్ బౌజర్ బృందాలను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసి ఆసుపత్రులకు తరలించాయి. శిథిలాల కింద మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. భవనం కూలిన సమయంలో అందులో కనీసం 50 మంది విద్యార్థులు ఉన్నట్లు భావిస్తున్నామని ఓ ప్రత్యక్ష సాక్షి తెలిపారు. దీంతో మిగిలిన వారి కోసం రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు.

**ఘటనా స్థలానికి సీఎం, ఎల్జీ**

ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ తరంజీత్ సింగ్ సంధూ, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఎంపీ బాన్సురీ స్వరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా మాట్లాడుతూ.. సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న మరో భవనాన్ని ఖాళీ చేయించినట్లు వెల్లడించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, శిథిలాల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం, పోలీస్ కమిషనర్, ఎన్డీఎంఏ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా, గురుగ్రామ్‌లో నివసిస్తున్న భవన యజమానిపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలకు అడ్డంకి కలగకుండా ఉండేందుకు ఆర్మ్‌డ్ పోలీసు బలగాలను ఆ ప్రాంతంలో మోహరించారు.

**మృతుల కుటుంబాలకు ప్రధాని సానుభూతి**

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఘటనాస్థలిలో అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారని, ప్రమాదంలో ప్రభావితమైన వారికి అవసరమైన సహాయం అందిస్తున్నారని ప్రధాని కార్యాలయం 'ఎక్స్'లో పేర్కొంది.



**ప్రమాదంపై రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి**

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో భవనం కూలిన ఘటనపై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు జాతీయ విపత్తు స్పందన దళం, ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, ఇతర సహాయక బృందాలు అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సత్య నికేతన్‌లో భవనం కూలిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని రాహుల్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం ఉందని, వారిలో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు కూడా ఉన్నారని తెలిపారు. "శిథిలాల కింద చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ చేరుకునేందుకు సహాయక బృందాలు శక్తివంచన లేకుండా పనిచేయాలి. గాయపడిన వారికి వెంటనే అత్యుత్తమ వైద్య చికిత్స అందేలా చూడాలి. ఒక్క ప్రాణాన్ని కాపాడేందుకు కూడా ఎలాంటి లోటు రానీయవద్దు" అని రాహుల్ గాంధీ అన్నారు.

**ఎమ్‌సీడీ ఆఫీస్‌పై ఏబీవీపీ దాడి**

ఈ దారుణ ఘటనకు మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. ఎమ్‌సీడీ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేశారు. అక్రమ నిర్మాణాలు, బేస్‌మెంట్ తవ్వకాలపై అధికారులు కంటితుడుపు చర్యలు చేపట్టడం వల్లే విద్యార్థుల ప్రాణాలు బలికావాల్సి వచ్చిందని వారు మండిపడ్డారు.

## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 6, (రథసారథి న్యూస్): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దూషణలు, ట్రోలింగ్ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇప్పటివరకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళల భద్రత విషయంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ట్రోలింగ్‌లు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని కవిత అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, అయినప్పటికీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు గుర్తింపు, సంక్షేమం, భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత కోరారు. ఉద్యమకారులకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉన్నందున నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడానికి కారణం లేదన్నారు. కొంతమందికైనా గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలని అన్నారు.

బీసీల సంక్షేమం, రిజర్వేషన్ల అంశాలపై కూడా కవిత స్పందించారు. బీసీలకు న్యాయం చేస్తామని చెప్పే పార్టీలు ఆచరణలో మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సమర్థవంతమైన చర్చలు జరపడం లేదని ఆరోపించారు. కుల గణనలో స్పష్టమైన వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ఫీజు నియంత్రణ, ఉద్యమకారుల సంక్షేమం, మహిళల భద్రత, సామాజిక న్యాయం వంటి అంశాలపై చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం



(రథసారథి న్యూస్ ) హైదరాబాద్: ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, ఈహెచ్ఎస్ పథకం అమలులో రాజీ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమవారేనని, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు ఒడిదొడులకు లోనవ్వద్దనే ఉన్నతాశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు చేస్తోందన్నారు. ఇందులో ఇప్పటికే 354 ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా, మరికొన్నింటిని డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్లు చెప్పారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ ఆషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పదేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అనుచిత భాష వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాలా?



(రథసారథి న్యూస్ ) హైదరాబాద్: 'ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి అనుచిత భాష వాడుతున్నారు. అలాంటి గౌరవం లేని సభకు కేసీఆర్ వెళ్లాల్సిన అవసరం లేదు. సభ్య సమాజం తలదించుకొనే వ్యాఖ్యలతో జరుగుతున్న చర్చలో తెలంగాణ సాధించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాల్గొనకూడదని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా నిర్ణయించారు' అని భారాస శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు వెల్లడించారు. ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నేతలను సభలో అవమానిస్తే... వారు సమావేశాలను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రులుగా అడుగుపెట్టారని, కేసీఆర్ కూడా అదేబాటలో మళ్లీ సీఎంగానే శాసనసభలో అడుగుపెడతారని స్పష్టంచేశారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో ఆదివారం భారాస ఎల్పీ సమావేశం నిర్వహించారు.

అనంతరం చర్చించిన వివరాలను పార్టీ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, విజయుడు, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. "కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెల రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నడపాలని బీఏసీ సమావేశంలో భారాస పక్షాన గట్టిగా డిమాండ్ చేయాలని నిర్ణయించాం. 22ఏ కింద భూములను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్న తీరుపై, కరెంట్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ ఫెయిల్యూర్ వంటి అన్ని అంశాలపైనా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారమవుతోంది. విద్యార్థుల పక్షాన అవసరమైతే సభను స్తంభింపజేసైనా న్యాయం జరిగే దాకా కొట్లాడతాం. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో కేసీఆర్ స్వయంగా లక్షల మందితో ప్రత్యక్ష ఉద్యమానికి నాయకత్వం వహిస్తారు. పాలన చేతకాక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ.. ఆ అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డి 'కేసీఆర్ రాజీనామా' అంటూ కొత్త డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పిన ముఖ్యమంత్రే రాజీనామా చేయాలి. పక్క రాష్ట్రాల్లో మాజీ సీఎంలకు భద్రత కల్పించడం లేదా? కనీసం వార్డు మెంబర్ కూడా కాని సీఎం సోదరుడికి నలుగురు గన్‌మెన్లు పెట్టి, భద్రత కోసం రూ.40 కోట్లు ఎలా ఖర్చు చేశారో సీఎం సమాధానం చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలి**

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి తమ ఇబ్బందులను అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులంటే ముఖ్యమంత్రికి ఎందుకంత కక్ష? తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు.

## ఈజిప్టులో భారత వైమానిక దళం 'సారంగ్' విన్యాసాలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6, (రథసారథి న్యూస్ ): భారత వైమానిక దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక 'సారంగ్' హెలికాప్టర్ డిస్‌ప్లే బృందం ఈజిప్టుకు చేరుకుంది. సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఎల్ అలమైన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరగనున్న రెండో ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో ఈ బృందం పాల్గొననుంది. భారత వైమానిక దళం తరపున అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను చాటే లక్ష్యంతో సారంగ్ బృందం తన విన్యాసాలను ప్రదర్శించనుంది.

సారంగ్ బృందం ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో సమన్వయపూర్వక వైమానిక విన్యాసాలు నిర్వహించే ఏకైక హెలికాప్టర్ ప్రదర్శన బృందంగా గుర్తింపు పొందింది. అత్యంత కచ్చితత్వంతో, సమన్వయంతో కూడిన విన్యాసాల ద్వారా ప్రేక్షకులను అలరించడంలో ఈ బృందానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పైలట్ల నైపుణ్యం, క్రమశిక్షణ, సమయపాలన ఈ ప్రదర్శనల ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.

ఈ బృందం స్వదేశీంగా రూపకల్పన చేసి తయారు చేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ 'ధ్రువ్'ను వినియోగిస్తోంది. సమీప దూరాల్లో సమూహంగా ఎగిరే విన్యాసాలు, సమన్వయంతో కూడిన వైమానిక కదలికలు, క్లిష్టమైన ఆకృతి ప్రదర్శనలు సారంగ్ ప్రత్యేకతగా నిలిచాయి. ప్రతి విన్యాసం ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపేలా అత్యంత జాగ్రత్తగా రూపొందించబడుతుంది. సారంగ్ బృందం ప్రదర్శనలు భారత వైమానిక దళం సామర్థ్యాలను మాత్రమే కాకుండా దేశీయ రక్షణ తయారీ రంగం అభివృద్ధిని కూడా ప్రతిబింబిస్తాయి. ధ్రువ్ హెలికాప్టర్ సామర్థ్యాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడం ద్వారా భారత స్వదేశీ వైమానిక సాంకేతికతకు మరింత గుర్తింపు లభించనుంది.

ఈ కార్యక్రమంలో పాల్గొనడం భారత్‌ఈజిప్ట్ మధ్య పెరుగుతున్న రక్షణ, దౌత్య సంబంధాలకు నిదర్శనంగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య రక్షణ రంగ సహకారం మరింత బలోపేతం అవుతున్న నేపథ్యంలో సారంగ్ బృందం పాల్గొనడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో సారంగ్ బృందం తన అద్భుత వైమానిక విన్యాసాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. భారత వైమానిక దళం నైపుణ్యం, స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పే మరో కీలక అవకాశంగా ఈ ప్రదర్శన నిలవనుంది.

# హుస్సేన్ సాగర్ తీరంలో ఘనంగా తెలంగాణ గంగా తెప్పోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 6,(రథసారథి న్యూస్ ) హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద హుస్సేన్ సాగర్ తీరంలో తెలంగాణ గంగా తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగా హారతి స్వీకరించి భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్సేన్ సాగర్ తీర ప్రాంతం భక్తుల సందడితో కళకళలాడగా, గంగా మాత నామ స్మరణలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ప్రజాప్రతినిధులు గంగపుత్రుల సంప్రదాయాలను కొనియాడుతూ వారి సేవలను గుర్తు చేశారు.గంగా తెప్పోత్సవానికి మహిళలు, గంగపుత్రులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో



వచ్చిన భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగా హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా సాగగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాంప్రదాయ సంగీతం, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలోని గంగపుత్రులు, మత్స్యకారుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలు ఎంతో గొప్పవని అన్నారు. వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గంగపుత్రుల పాత్ర విశిష్టమైందని, వారి సంస్కృతి తెలంగాణ వారసత్వంలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు.హుస్సేన్ సాగర్ తీరంలో నిర్వహించిన గంగా తెప్పోత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతి, గంగపుత్రుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. గంగా మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. కార్యక్రమం ముగింపులో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, గంగా హారతితో వేడుకలు ఆధ్యాత్మికంగా ముగిశాయి.



# ‘బంగారు’ లాభం! ఒక్క లక్ష.. 3.28 లక్షలైంది

బంగారంపై పెట్టిన సొమ్ము.. ఎన్నటికీ వొమ్ము కాదు అనేది పెద్దలు చెప్పే మాట. అది వట్టి మాట మాత్రమే కాదు. 202122 సిరీస్-VI సావరిన్ గోల్డ్ బాండ్లలో (SGB) పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాలు అందనున్నాయి. ఐదేళ్ల తర్వాత ముందస్తు రిడీమ్‌కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఒక్కో యూనిట్ రిడంప్షన్ ధరను రూ.15,334గా నిర్ణయించింది. ఈ సెప్టెంబర్ 7న ఈ ధరకు బాండ్లను ముందస్తుగా రిడీమ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

**కొన్నప్పుడు ఎంతంటే..**

202122 సిరీస్-VI సావరిన్ గోల్డ్ బాండ్లని 2021 సెప్టెంబర్ 7న జారీ చేశారు. సాధారణ పెట్టుబడిదారులకు ఇష్యూ ధర గ్రాముకు రూ.4,732 కాగా, ఆన్‌లైన్‌లో డిజిటల్ పేమెంట్ ద్వారా కొనుగోలు చేసిన వారికి రూ.50 డిస్కౌంట్‌తో రూ.4,682గా నిర్ణయించారు.

ఇప్పుడు ముందస్తు రిడంప్షన్ ధర రూ.15,334కి చేరడంతో ఆన్‌లైన్‌లో రూ.4,682కు కొనుగోలు చేసినవారికి ఒక్కో యూనిట్‌పై రూ.10,652 లాభం వస్తోంది. అంటే అసలు పెట్టుబడిపై సుమారు 227.5 శాతం రాబడి లభించినట్టే. దీనిపై వడ్డీ ఆదాయం కూడా ఉంటుంది.

ఉదాహరణతో చూస్తే.. 2021లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి సుమారు 21.36 యూనిట్ల సావరిన్ గోల్డ్ బాండ్లని కొనుగోలు చేశారనుకుంటే.. ప్రస్తుత రిడంప్షన్ ధర ప్రకారం ఆ యూనిట్ల విలువ సుమారు రూ.3.28 లక్షలకు చేరుతుంది. అంటే ఐదేళ్లలో బంగారం ధర పెరుగుదల ద్వారా దాదాపు రూ.2.28 లక్షల లాభం వచ్చినట్టవుతుంది.

**అదనంగా వడ్డీ కూడా..**

సావరిన్ గోల్డ్ బాండ్ల ప్రత్యేకత కేవలం బంగారం ధర పెరుగుదలతో వచ్చే లాభం మాత్రమే కాదు. 202122 సిరీస్-VIపై ఏటా 2.50 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. ఈ వడ్డీని ప్రారంభ పెట్టుబడి మొత్తంపై లెక్కించి ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. కాబట్టి ఐదేళ్లపాటు బాండ్‌ను కొనసాగించినవారికి పై రూ.3.28 లక్షల విలువకు అదనంగా ఇప్పటివరకు వచ్చిన వడ్డీ కూడా ఉంటుంది.

**రిడంప్షన్ ధర ఎలా నిర్ణయించారు?**

సావరిన్ గోల్డ్ బాండ్ల ముందస్తు రిడంప్షన్ ధరను ఆర్బీఐ (RBI) నేరుగా నిర్ణయించిన స్థిర మొత్తం కాదు. బంగారం ధర ఆధారంగా లెక్కిస్తారు. 2026 సెప్టెంబర్ 7 రిడంప్షన్ కోసం సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో 999 స్వచ్ఛత బంగారం ముగింపు ధరల సాధారణ సగటును పరిగణనలోకి తీసుకుని ఆర్బీఐ రూ.15,334 ధరను ప్రకటించింది.

**ఎప్పుడు రిడీమ్ చేసుకోవచ్చు?**

సావరిన్ గోల్డ్ బాండ్లకు సాధారణంగా 8 ఏళ్ల మెచ్యూరిటీ ఉంటుంది. అయితే జారీ తేదీ నుంచి ఐదేళ్లు పూర్తైన తర్వాత, వడ్డీ చెల్లింపు తేదీల్లో ముందస్తు రిడంప్షన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం 2021 22 సిరీస్-VIకి 2026 సెప్టెంబర్ 7 నుంచి ముందస్తు రిడంప్షన్ అవకాశం వచ్చింది.



# ప్రపంచ కళలకు భారతీయ వేదిక.. ఎన్‌మ్యాక్

భారతీయ కళలు, సంస్కృతికి అంతర్జాతీయ వేదికగా.. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కళా ప్రదర్శనలు, సంగీత, నాటక ప్రదర్శనలను భారత ప్రేక్షకులకు చేరువ చేసే కేంద్రంగా నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (NMACC) తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ముంబైలో 2023 మార్చిలో ప్రారంభమైన ఈ సాంస్కృతిక కేంద్రం మూడేళ్ల ప్రస్థానంలో ఎన్నో ఘనమైన కళా వేడుకలకు వేదికను పంచింది.

మూడేళ్లలో ఎన్‌మ్యాక్‌లో 3,500కు పైగా ప్రదర్శనలు జరిగాయి. దాదాపు 25 లక్షల మంది ప్రేక్షకులు సందర్శించగా.. సంగీతం, నాటకం, నృత్యం, దృశ్యకళ తదితర రంగాలకు చెందిన 10,500 మందికి పైగా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. 15కుపైగా భాషల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోని గ్రాండ్ థియేటర్ అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. ది సౌండ్ ఆఫ్ మ్యూజిక్, వెస్ట్ సైడ్ స్టోరీ, మమ్మా మియా, ది ఫ్యాంటమ్ ఆఫ్ ఒపేరా, విక్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ ప్రొడక్షన్స్ ఇక్కడ ప్రేక్షకులను అలరించాయి. అదే వేదికపై మొఘల్‌ఎఆజమ్: ది మ్యూజికల్, రాజాధిరాజ్: లవ్. లైఫ్. లీలాతో పాటు ఎన్‌మ్యాక్ ఒరిజినల్ ప్రొడక్షన్ ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్ వంటి భారతీయ ప్రదర్శనలు సైతం ఘనంగా సాగాయి. స్టూడియో థియేటర్, ది క్యూబ్ వేదికలు చిన్న స్థాయి, ప్రయోగాత్మక ప్రదర్శనలకు ప్రత్యేక స్థానం కల్పించాయి. థియేటర్, సంగీతం, కామెడీ, నృత్యం తదితర విభాగాల్లో హిందీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ సహా పలు భాషల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

దృశ్యకళల పరంగా ఎన్‌మ్యాక్‌లోని ఆర్ట్ హౌస్ అంతర్జాతీయ కళా ప్రపంచాన్ని ముంబైకి తీసుకొచ్చింది. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంతో కలిసి వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్, దియా ఆర్ట్ ఫౌండేషన్ సహకారంతో లైట్ ఇన్‌టు స్పేస్, భక్తి, బల్గరీ సెర్పెంటి ఇన్ఫినిటో వంటి ప్రదర్శనలు నిర్వహించింది. ప్రస్తుతం సెకెండ్ నేచర్ పేరుతో కొనసాగుతున్న ప్రదర్శనలో టీమ్‌ల్యాబ్, ఎ.ఎ.మురకామి, ఈఎస్ డెవ్లిన్, ర్యాండమ్ ఇంటర్‌నేషనల్ తదితర కళాకారులు, స్టూడియోల తొమ్మిది భారీ స్థాయి ఇన్‌స్టాలేషన్లు ఉన్నాయి. ఈ ప్రదర్శన 2027 జనవరి వరకు కొనసాగనుంది.

అంతర్జాతీయ కళా రంగంతో ఎన్‌మ్యాక్ అనుబంధం ముంబైకే పరిమితం కాలేదు. 61వ వెనిస్ బియన్నాలేలో ఇండియా పెవిలియన్‌ను ప్రదర్శించేందుకు భాగస్వామ్యం చేయడం ద్వారా భారత సమకాలీన కళాకారులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించే అవకాశాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో ఐదుగురు సమకాలీన భారతీయ కళాకారులను ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లింది.

ఎన్‌మ్యాక్ నాలుగో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ భారతీయ, అంతర్జాతీయ కళా ప్రపంచాల మధ్య ఈ సాంస్కృతిక మార్పిడి మరింత విస్తరించనుంది. రానున్న రోజుల్లో ‘ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్’ తిరిగి ప్రదర్శితం కానుండగా.. చికాగో రానుంది. అలాగే ఆస్కార్ నామినీ సంగీత దర్శకుడు మ్యాక్స్ రిక్టర్ తొలిసారి భారత్‌లో ప్రదర్శన ఇవ్వనున్నారు. దీంతో భారత ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి కళా అనుభవాలను అందించడంతో పాటు, భారతీయ కళలు, కథనాలకు అంతర్జాతీయ వేదిక కల్పించే ఎన్‌మ్యాక్ పాత్ర మరింత బలోపేతం కానుంది.



# భారీగా పెరిగిన ఇళ్ల ధరలు.. కారణాలు ఇవే!

భారత్‌లో ఇళ్ల ధరలు గత ఐదేళ్లలో నిర్మాణ ఖర్చుల కంటే చాలా వేగంగా పెరిగాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో 2021 నుంచి 2025 మధ్య కాలంలో ఇళ్ల నిర్మాణ ఖర్చు 34 శాతం పెరిగితే.. ఇళ్ల ధరలు ఏకంగా 59 శాతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

**నిర్మాణ ఖర్చు**

అనరాక్ నివేదిక ప్రకారం.. 2021లో ఒక సాధారణ ప్లస్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను నిర్మించడానికి చదరపు అడుగుకు సగటున రూ.2,681 ఖర్చయ్యేది. 2025 నాటికి అది రూ.3,604కు చేరింది. అంటే ఐదేళ్లలో నిర్మాణ ఖర్చు సుమారు 34 శాతం పెరిగింది. ఏడాదికి 6.9 శాతం పెరుగుదల అన్నమాట.

**ఇళ్ల ధరలు**

ఇదే సమయంలో ఇళ్ల సగటు ధరలు కూడా చాలా వేగంగా పెరిగాయి. 2021లో ప్రధాన నగరాల్లో చదరపు అడుగు సగటు రెసిడెన్షియల్ క్యాపిటల్ విలువ రూ.5,826గా ఉండగా, 2025 నాటికి అది రూ.9,260కు చేరింది. అంటే ఐదేళ్లలో ఇళ్ల ధరలు ఏకంగా 59 శాతం పెరిగాయి. వార్షిక వృద్ధి రేటు దాదాపు 12 శాతంగా ఉంది.

మొత్తం మీద నిర్మాణ ఖర్చు 34 శాతం పెరిగితే.. ఇళ్ల ధర మాత్రం 59 శాతం పెరిగిందని నివేదిక చెబుతోంది. ఈ రెండింటి మధ్య దాదాపు 25 శాతం వ్యత్యాసం ఉంది.

**ఇళ్ల ధరలు పెరగడానికి కారణం**

ఇళ్ల ధరలు కేవలం సిమెంట్, స్టీల్, కార్మిక ఖర్చుల వల్ల మాత్రమే పెరగడం లేదు. ఇందులో భూమి ధరలు, డెవలపర్ల మార్జిన్లు, డిమాండ్ అండ్ సప్లై పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా.. పెద్ద నగరాల్లో భూమి ధరలు భారీగా పెరిగాయి. కొత్త రోడ్లు, మెట్రో, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో భూమి విలువలు మరింత వేగంగా పెరుగుతున్నాయి.

నిర్మాణ ఖర్చులు కూడా గణనీయంగా పెరిగాయి. స్టీల్, ఇంధనం, రవాణా, ఫినిషింగ్ మెటీరియల్స్ వంటి ఖర్చులు కూడా కారణమయ్యాయి. టైల్స్, గ్లాస్, హార్డ్‌వేర్ వంటి ఫినిషింగ్ మెటీరియల్స్ ధరలు సుమారు 812 శాతం పెరిగాయి. మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్‌కు సంబంధించిన ఖర్చులు కూడా 913 శాతం పెరిగాయి. కార్మిక వ్యయం పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

అనరాక్ ప్రకారం.. 2021 నుంచి 2026 మొదటి అర్ధభాగం వరకు ప్రధాన నగరాల్లోని చాలా ప్రాంతాల్లో భూమి ధరలు 50 నుంచి 120 శాతం వరకు పెరిగాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు ప్రాంతాల్లో ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది.

**ఇల్లు కొనేవారికి కష్టమేనా?**

ఇళ్ల ధరలు నిర్మాణ ఖర్చుల కంటే వేగంగా పెరగడం వల్ల ప్రధానంగా హోమ్‌బయ్యర్లపై భారం పెరుగుతుంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు చెందినవారు ఇప్పటికే ఈఎంఐలు, డౌన్ పేమెంట్, ఇతర ఖర్చులను భరించాల్సి ఉంటుంది. ఇళ్ల ధరలు మరింత పెరిగితే వారికి అందుబాటులో ఉన్న ఇళ్ల ఎంపికలు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే.. ప్రీమియం, లగ్జరీ ఇళ్ల విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే.. అధిక ఆదాయం ఉన్న కొనుగోలుదారులు ధరల పెరుగుదలను కొంతవరకు భరించగలరు.

# సుభాష్ చంద్ర కేసులో ట్విస్ట్.. నెట్‌వర్త్‌పై CBI దర్యాప్తు!

మాజీ ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్రతో పాటు.. పలువురిపై రూ.980 కోట్ల రుణానికి సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (CBI) కేసు నమోదు చేసింది. ఈ కేసు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LICHFL) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైంది. ఇందులో నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అక్రమంగా లాభం పొందడం వంటి ఆరోపణలను సీబీఐ పరిశీలిస్తోంది.

**నికర ఆస్తుల విలువ**


ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం సుభాష్ చంద్ర నికర ఆస్తుల విలువ. ఈ వ్యవహారంలో రెండు వేర్వేరు రుణాలు ప్రధానంగా ఉన్నాయి. మొదటిది వసంత్ సాగర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని కోబారోయర్ పాన్ ఇండియా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చిన సుమారు రూ.500 కోట్ల రుణం. వ్యాపార కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ రుణాన్ని 'టేకోవర్ అండ్ టాప్‌అప్ ఫెసిలిటీ'గా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ మంజూరు చేసింది. ఈ రుణానికి సుభాష్ చంద్ర గ్యారంటర్‌గా నిలిచారు. రుణం మంజూరు సమయంలో సమర్పించిన నికర ఆస్తుల సర్టిఫికెట్‌లో సుభాష్ చంద్ర ఆస్తుల విలువ చాలా ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నట్లు సీబీఐ ఫిర్యాదులో ఉంది. 2018 మార్చి 28న సమర్పించిన ఆ సర్టిఫికెట్ ప్రకారం, 2017 మార్చి 31 నాటికి ఆయన నికర విలువ 6,197.62 మిలియన్ డాలర్లు, అంటే అప్పటి లెక్కల ప్రకారం సుమారు రూ.59,000 కోట్ల స్థాయిలో ఉన్నట్లు చూపించారు.

ఇక రెండో రుణం డిజిటల్ సబ్‌స్క్రైబర్ మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించినది. దాని కోబారోయర్ అయిన స్పిరిట్ ఇన్‌ఫ్రా పవర్ అండ్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సుమారు రూ.480 కోట్ల రుణం మంజూరైంది. ఈ రుణానికి కూడా సుభాష్ చంద్ర గ్యారంటీ ఇచ్చారు. ఈ సందర్భంలో సమర్పించిన మరో నికర విలువ సర్టిఫికెట్‌లో ఆయన నికర ఆస్తుల విలువ రూ.40,000 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నట్లు సీబీఐ తెలిపింది. అంటే.. రెండు రుణాలను కలిపితే సుమారు రూ.980 కోట్లు. రుణాలు తీసుకునే సమయంలో సుభాష్ చంద్ర ఆర్థికంగా వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కలిగిన వ్యక్తిగా పత్రాల్లో చూపించారు. ఈ రెండు రుణాలు తరువాత డిఫాల్ట్ అయ్యాయి. అంటే.. రుణాలను తిరిగి చెల్లించడంలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో విషయం మరింత తీవ్రంగా మారి, సుభాష్ చంద్రపై ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (IBC) కింద వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలు ప్రారంభమయ్యాయి.



**పత్రాల్లో వేలకోట్లు**

రుణాలు తీసుకునే సమయంలో సమర్పించిన పత్రాల్లో సుభాష్ చంద్ర నికర విలువ వేల కోట్ల రూపాయలుగా చూపించబడింది. అయితే తర్వాత జరిగిన ఇన్సాల్వెన్సీ ప్రక్రియలో ఆయన ఆ స్థాయి ఆస్తులు తనకు లేవని పేర్కొన్నట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఉంది. ముఖ్యంగా, 2024 సంవత్సరానికి తన నికర విలువ సుమారు రూ.31.79 కోట్లు మాత్రమేనని ఆయన పేర్కొన్నట్లు ఫిర్యాదులో వెల్లడైంది. అంతేకాకుండా.. 201718 కాలంలో కూడా తన నికర విలువ రూ.40,000 కోట్లకు మించలేదని ఆయన చెప్పినట్లు సీబీఐ పేర్కొంది. ఇక్కడే సీబీఐ దర్యాప్తు ప్రధానంగా కేంద్రీకృతమవుతోంది. ఒకవైపు రుణాలు తీసుకునే సమయంలో సమర్పించిన పత్రాల్లో సుభాష్ చంద్ర నికర విలువ రూ.40,000 కోట్ల నుంచి రూ.59,000 కోట్ల స్థాయిలో ఉన్నట్లు కనిపిస్తోంది. మరోవైపు.. ఇన్సాల్వెన్సీ ప్రక్రియలో ఆయన ఆస్తుల విలువ చాలా తక్కువగా ఉందని పేర్కొన్నట్లు సీబీఐ చెబుతోంది. కాబట్టి.. రుణం పొందేందుకు నికర ఆస్తుల విలువను కావాలనే ఎక్కువగా చూపించారా? అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది.



# మనశ్శాంతి కోసం జాబ్ మానేసి.. నెలకు రూ.కోటి టర్నోవర్!

సాధారణంగా బెంగళూరు నగరంలో.. యాక్సెంచర్ వంటి కంపెనీలో ఉద్యోగం వస్తే ఎవరు మాత్రం వద్దనుకుంటారు. కానీ సుప్రీత్ కశ్యప్ మాత్రం ఇందుకు భిన్నంగా.. ఉద్యోగం వదిలి మనశ్శాంతి కోసం సొంత ఊరికి వెళ్లిపోయాడు. నేడు నెలకు కోట్ల రూపాయల ఆదాయం సంపాదించే స్థాయికి చేరాడు. ఇంతకీ కశ్యప్ ఏం చేసాడు?, ఎలా సంపాదిస్తున్నాడు?, అనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**యాక్సెంచర్ ఉద్యోగం వదిలి..**

సుప్రీత్ కశ్యప్ మైసూరులో పుట్టి పెరిగాడు. తాను మైసూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ చదివాడు. చదువు పూర్తయ్యాక, 2017లో యాక్సెంచర్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం అతనికి మంచి కెరీర్ ఇచ్చినప్పటికీ.. బెంగళూరులో జీవనశైలి తనకు సరిపోవడం లేదని భావించాడు. నగరంలోని ట్రాఫిక్, రద్దీ, నిరంతర ఒత్తిడి కారణంగా ప్రశాంతత లోపించిందని అనిపించింది.

**వెల్ఫీ పేరుతో వ్యాపారం..**

అందుకే.. 2018లో యాక్సెంచర్‌లో ఉద్యోగాన్ని వదిలి మైసూరుకు వెళ్ళిపోయాడు. ప్రారంభంలో ఫ్రీలాన్స్ కన్సల్టెంట్‌గా పనిచేశాడు. అయితే.. తనకు కేవలం ఉద్యోగం చేయడం కాకుండా, మైసూరు నుంచే ఒక సంస్థను నిర్మించి, ఇతరులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆలోచన వచ్చింది. ఈ ఆలోచనతో కశ్యప్ వెల్ఫీ పేరుతో.. దుస్తుల వ్యాపారాన్ని 2021లో ప్రారంభించాడు. వెల్ఫీ అనేది ప్రధానంగా సౌకర్యవంతమైన, స్పోర్ట్స్, రోజువారీ అవసరాలకు ఉపయోగపడే దుస్తులను తయారు చేస్తుంది. సస్టైనబుల్, ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్‌కు కూడా సంస్థ ప్రాధాన్యత ఇస్తుంది.

**రూ.10 లక్షలు పెట్టుబడి**

సుప్రీత్ తన వ్యాపారం ద్వారా చాలామందికి ఉద్యోగాలు కూడా కల్పించాలని సంకల్పించాడు. దీంతో.. టైర్2, టైర్3 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉద్యోగావకాశాలను సృష్టించాలని భావించాడు. వెల్ఫీలో ఇప్పుడు 15 మందికి పైగా ఫుల్‌టైమ్ ఉద్యోగులు ఉన్నారు. సుమారు 40 మంది చేతివృత్తి కళాకారులతో కలిసి పనిచేస్తున్నారు.

వెల్ఫీని ప్రారంభించడానికి సుప్రీత్ మొదట కుటుంబ సభ్యుల సహాయంతో.. సుమారు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ వ్యాపారం క్రమంగా అభివృద్ధి చెందడంతో మొత్తం పెట్టుబడి రూ.50 లక్షలకు చేరింది. తరువాత సంస్థకు ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి సుమారు రూ.3 కోట్ల పెట్టుబడి లభించింది.

**కోట్లలో టర్నోవర్**

కంపెనీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. మొదటి సంవత్సరంలో సుమారు రూ.11 లక్షల ఆదాయం వచ్చింది. తరువాతి సంవత్సరం అది రూ.70 లక్షలకు పెరిగింది. ఆ తర్వాత రూ.2.4 కోట్లు, తదుపరి సంవత్సరం రూ.5.6 కోట్లు ఆదాయం సాధించింది. ఇప్పుడు సంస్థ ఏడాదికి సుమారు రూ.1516 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయాణంలో వెల్ఫీ నెలకు సుమారు రూ.1 కోటి ఆదాయం సాధించే స్థాయికి చేరుకుంది. కేవలం రూ.10 లక్షలతో ప్రారంభమైన వ్యాపారం, ఇంత పెద్ద స్థాయికి ఎదగడం సుప్రీత్ వ్యాపార ప్రయాణంలో సాధించిన గొప్ప విజయం అనే చెప్పాలి.

సుప్రీత్ తనను తాను ఒక యాదృచ్ఛిక పారిశ్రామికవేత్తగా భావిస్తాడు. ఎందుకంటే అతడు అనుకోకుండా వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. అంతే కాకుండా.. తన కుటుంబానికి కూడా వ్యాపార నేపథ్యం లేదు. అందువల్ల వ్యాపారం ప్రారంభించినప్పుడు.. తనకు అనుభవం కూడా పెద్దగా లేదు. కానీ కాలక్రమంలో అనుభవంతో పాటు అనేక విషయాలు నేర్చుకున్నాడు.

**మైసూరు నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లోకి**

ప్రారంభంలో.. మంచి ఫ్యాషన్ ఫొటోషూట్లు చేస్తే అమ్మకాలు పెరుగుతాయని ఆయన అనుకున్నాడు. కానీ.. తర్వాత అసలు విజయం మంచి ఫొటోలలో కాకుండా, మంచి ఉత్పత్తిని తయారు చేయడం, వినియోగదారులకు అది నిజంగా అవసరమా అని తెలుసుకోవడంలో ఉందని గ్రహించాడు.

అలాగే ఉద్యోగులను నియమించడంలో కూడా ఆయనకు ఒక ముఖ్యమైన పాఠం తెలిసింది. మొదట ప్రతి పనికి ప్రత్యేక వ్యక్తులను నియమించడం వల్ల సంస్థలో అవసరానికి మించిన పెద్ద టీమ్ ఏర్పడింది. తరువాత ఒకటి కంటే ఎక్కువ పనులు చేయగలిగే మల్టీ టాస్క్ ఉద్యోగులను నియమించడం ద్వారా చిన్న టీమ్‌తోనే సంస్థను సమర్థవంతంగా నడపవచ్చని తెలుసుకున్నాడు.

మైసూరులో ప్రారంభమైన వెల్ఫీ.. ఇప్పుడు భారతదేశం దాటి అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో అమెజాన్ ద్వారా ఉత్పత్తులను విక్రయించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.




# శ్రీలంక హ్యాట్రిక్ విజయం

దుబాయ్: మహిళల ఆసియా కప్ టి20 టోర్నీలో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో శ్రీలంక 4 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ టోర్నీలో శ్రీలంక జట్టుకిది 'హ్యాట్రిక్' విజయం. మొదట బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 114 పరుగులు చేసింది. శోభన (34; 4 ఫోర్లు) టాప్ స్కోరర్.
శ్రీలంక బౌలర్లలో ప్రబోద 3 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 115 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్షిత (37 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి జట్టును గెలిపించింది. నేడు జరిగే మ్యాచ్‌లో హాంకాంగ్‌తో పాకిస్తాన్ ఆడుతుంది.

# ప్రిక్వార్టర్స్‌లో అల్‌కరాజ్

**యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**



న్యూయార్క్: సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ దూసుకుపోతున్నాడు. మూడో రౌండ్‌లో అలవోక విజయంతో అతను ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఈ పోరులో అల్‌కరాజ్ (స్పెయిన్) 6-3, 6-4, 6-1తో వు యిబింగ్ (చైనా)పై ఘన విజయం సాధించాడు. 2 గంటల 20 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6 ఏస్‌లు, 21 విన్నర్‌లు కొట్టాడు. 2021 చాంపియన్, ఏడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ముందంజ వేశాడు. మూడో రౌండ్‌లో అతను 6-4, 6-4, 6-4తో ఆర్థర్ రిండర్‌నెక్ (ఫ్రాన్స్)ను ఓడించాడు.
పురుషుల విభాగంలో 8వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా), 11వ సీడ్ ఫ్రాన్సిస్ టియాఫో (అమెరికా), సిట్సిపాస్ (గ్రీస్) కూడా ప్రిక్వార్టర్స్‌కు చేరగా... 15వ సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్తాన్) మూడో రౌండ్‌లో ఓడి నిష్క్రమించాడు. షెల్టన్ 7-6 (7/3), 6-7 (5/7), 6-3, 6-4 స్కోరుతో డెనిస్ షపలోవ్ (కెనడా)పై, టియాఫో 6-4, 6-2, 6-4తో వలెంటైన్ వాకెరట్ (మొనాకో)పై, సిట్సిపాస్ 2-6, 6-1, 7-6 (7/3), 6-1తో జిరి లెహెకా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు. బబ్లిక్‌ను 6-4, 3-6, 6-7 (4/7), 6-1, 6-3తో టామీ పాల్ (అమెరికా) ఓడించాడు.

**సెరెనా–వీనస్ జోడి ఓటమి**

మహిళల సింగిల్స్‌లో వింబుల్డన్ చాంపియన్, 6వ సీడ్ లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్) మూడో రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్స్‌కు చేరగా, 9వ సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) మూడో రౌండ్‌లో ఓడి వెనుదిరిగింది. నొస్కోవా 6-2, 6-7 (6/8), 6-2తో యాన్ లీ (అమెరికా)ను, స్వితోలినా (ఉక్రెయిన్) 3-6, 6-2, 3-6తో అనా కలినస్కియా (రష్యా) చేతిలో ఓటమిపాలైంది. మహిళల డబుల్స్ అమెరికా స్టార్ సిస్టర్స్ వీనస్ విలియమ్స్-సెరెనా విలియమ్స్ తొలి రౌండ్‌లోనే 'సూపర్ టైబ్రేక్'లో ఓడి వెనుదిరిగారు. మాయా జాయింట్ (ఆస్ట్రేలియా)-హావో చింగ్ చాన్ (చైనీస్ తైపీ) జోడి 6-3, 6-7 (6/8), 7-6 (10/7)తో వీనస్-సెరెనాపై విజయం సాధించారు.

**బాంబ్రీ, నికీ జోడీల నిష్క్రమణ...**

పురుషుల డబుల్స్‌లో భారత ప్లేయర్ నికీ పునాచా -గొంజాలో ఎస్కోబార్ (ఈక్వెడార్) ద్వయం మొదటి రౌండ్‌లోనే ఓడింది. నికీ-ఎస్కోబర్ 6-7 (3/7), 7-6 (7/4), 2-6 స్కోరుతో నీల్ ఒబర్‌లీట్‌నర్ (ఆస్ట్రియా)-పెట్ర్ నౌజా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాజయంపాలైంది. మరో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. బాంబ్రీ-మైకేల్ వీనస్ (అమెరికా) ద్వయం 6-7 (4/7), 6-7 (3/7)తో ర్యాన్ సెగెర్‌మన్-పాట్రిక్ ట్రాక్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు.



# 60 ఏళ్ల తర్వాత...

మోంజా: ఆరు దశాబ్దాల నిరీక్షణ ముగిసింది. ఫార్ములావన్ రేసింగ్ ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో ఇటలీకే చెందిన డ్రైవర్ విజేతగా అవతరించాడు. ఆదివారం జరిగిన ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో మెర్సిడెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇటలీకి చెందిన 20 ఏళ్ల కిమీ ఆంటోనెల్లి చాంపియన్‌గా నిలిచాడు. 19వ స్థానం నుంచి రేసును ఆరంభించిన ఆంటోనెల్లి నిర్ణీత 53 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 51 నిమిషాల 15.281 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.
1966లో లుడోవికో స్కార్ఫియోటి తర్వాత ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో టైటిల్ సాధించిన ఇటలీ డ్రైవర్‌గా ఆంటోనెల్లి గుర్తింపు పొందాడు. అత్యంత వెనుక స్థానంలో నుంచి రేసును ప్రారంభించి విజేతగా నిలిచిన రెండో డ్రైవర్‌గా ఆంటోనెల్లి ఘనత వహించాడు. 1983లో యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్‌ప్రిలో జాన్ వాట్సన్ (మెక్‌లారెన్–ఫోర్డ్) 22వ స్థానం నుంచి రేసును ఆరంభించి అగ్రస్థానం పొందాడు. ఈ సీజన్‌లో ఆంటోనెల్లికిది ఏడో విజయం. 23 రేసుల సీజన్‌లో 13 రేసులు ముగిశాక ఆంటోనెల్లి 267 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



# 'మా అక్కలు ప్లాన్ చేస్తే మేము ఆచరిస్తాం'

మహిళల ఆసియా కప్ 2026లో భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణి తన ప్రదర్శనతో అదరగొడుతుంది. శనివారం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసిన శ్రీ చరణి కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు తీసింది. మ్యాచ్‌లో చేసిన ప్రదర్శనకు గానూ శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. అవార్డు తీసుకున్న అనంతరం శ్రీ చరణి మాట్లాడింది.
'నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. మహిళల క్రికెట్ ఆడుతూ దేశానికి సేవ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నా. అయితే ప్రతీ మ్యాచ్‌కు జట్టులోని స్పిన్నర్లమంతా ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకుంటాం. నాతో పాటు ప్రేమ రావత్, దీప్తి శర్మ, రాధా యాదవ్ కలిసి మ్యాచ్‌లో ఎలా బౌలింగ్ చేయాలనేది చర్చించుకుంటాం. దీప్తి, రాధా దీదీలు చెప్పే ప్రతి సలహాను మైదానంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తాం.
50 వికెట్ల మార్క్‌కు ఒక్క వికెట్ దూరంలోఏ ఉన్నప్పటికీ, వాటిని నేను పట్టించుకోను. బౌలింగ్‌పైనే నా దృష్టంతా పెట్టాలనుకుంటున్నా. ఇక నాతో పాటు బౌలింగ్‌లో వికెట్లు తీసిన ప్రేమ రావత్‌కు కూడా మంచి భవిష్యత్తు ఉంది. ఆమెది సహజమైన ప్రతిభ. ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ సమానంగా ఉంటాయి. బౌలర్లకు సహకరించే వికెట్‌పై సుమారు 120 పరుగులు అనేది మంచి స్కోరు కింద లెక్కే. ఇకపై కూడా నా ప్రదర్శనను ఇలాగే కొనసాగించాలనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది.
మ్యాచ్ విషయానికొస్తే పాకిస్తాన్‌పై భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 18.1 ఓవర్లలో 55 పరుగులకు ఆలౌటైంది. మునీబా అలీ (13), షావల్ జుల్ఫికర్ (14) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. శ్రీ చరణి, ప్రేమ రావత్‌లు చెరో 3 వికెట్లు తీయగా, దీప్తి శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. అనంతరం భారత జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. హర్మన్ ప్రీత్ (18 నాటౌట్), దీప్తి శర్మ (12 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా 3 వికెట్లు పడగొట్టింది.

# అదే మా కొంపముంచింది..
## లేదంటే కథ మరోలా ఉండేది: పాక్ కెప్టెన్

మహిళల ఆసియాకప్2026లో పాకిస్తాన్‌కు తొలి ఓటమి ఎదురైంది. శనివారం దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో పాక్ ఘోర పరాజయం పాలైంది. మరోసారి దాయాది జట్టుపై హర్మన్ సేన ఆధిపత్యం చెలాయించింది. టాస్ గెలిచిన తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌కు భారత బౌలర్లు ఆది నుంచే చుక్కలు చూపించారు. ముఖ్యంగా పాక్ బ్యాటర్లు భారత స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడారు.
శ్రీచరణి, ప్రేమా రావత్ తలా మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును దెబ్బతీశారు. వీరిద్దరితో పాటు దీప్తి శర్మ రెండు, షెఫాలీ వర్మ ఓ వికెట్ సాధించారు. పాక్ బ్యాటర్ల విషయానికి వస్తే.. ఓపెనర్లు మునీబా(13), షవాల్ జుల్ఫికర్(14) మినహా మిగితా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.
బ్యాటింగ్‌లో విఫలమైన కెప్టెన్ ఫాతిమా సనా.. బౌలింగ్‌లో మాత్రం మూడు వికెట్లు పడగొట్టింది. అయినప్పటికి ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ మూడు వికెట్లు కోల్పోయి 8.4 ఓవర్లలో చేధించింది. ఇక ఈ ఓటమిపై మ్యాచ్ అనంతరం కెప్టెన్ ఫాతిమా స్పందించింది. బ్యాటింగ్ వైఫల్యం కారణంగానే ఓడిపోయామని సనా చెప్పుకొచ్చింది.




"ఈ ఓటమి మమ్మల్ని ఎంతగానో బాధించింది. మ్యాచ్‌లో కనీసం ఒక్క భాగస్వామ్యం కూడా నెలకొల్పలేకపోయాం. ఇన్నింగ్స్ ఆరంభం నుండి ముగిసే వరకు పరుగులు సాధించడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డాం. కొత్తపిచ్ కావడంతో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాం. బోర్డుపై మంచి స్కోరు ఉంచి, మా బౌలింగ్ బలాన్ని వాడుకోవాలనుకున్నాం.
కానీ మా ప్రణాళికలను మైదానంలో అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాం. నేను బౌలింగ్‌లో రాణించినా, జట్టు ఓడిపోయినప్పుడు ఆ ప్రదర్శనకు ఏ విలువా ఉండదు. అదే జట్టు గెలిచి ఉంటే ఆ సంతోషం వేరుగా ఉండేది. ఈ ఓటమి నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నాం. మా తదుపరి మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తామని" పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో సనా పేర్కొంది. కాగా పాక్ తమ తదుపరి మ్యాచ్‌లో సెప్టెంబర్ 7న హాంకాంగ్‌తో తలపడనుంది.




# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం..
# సిరాజ్‌ను సైతం వదల్లేదు

చెన్నై వేదికగా సౌత్‌జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ మెరుపులు మెరిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో తనదైన శైలిలో సూర్యవంశీ విరుచుకుపడ్డాడు. సౌత్‌జోన్‌కు ప్రాతనిధ్యం వహిస్తున్న స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను సైతం వైభవ్ వదల్లేదు.
7వ ఓవర్ వేసిన సిరాజ్ బౌలింగ్‌లో వైభవ్ రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 14 పరుగులు పిండుకున్నాడు. ఓవరాల్‌గా 37 బంతులు ఎదుర్కొన్న వైభవ్.. 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు చేశాడు. మరోసారి షార్ట్ లెంగ్త్ డెలివరీకే వైభవ్ తన వికెట్‌ను కోల్పోయాడు. సీవీ మిలింద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి బౌండరీ లైన్ వద్ద సూర్యవంశీ దొరికిపోయాడు. ఇక ఈస్ట్‌జోన్ 21 ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టానికి 125 పరుగులు చేసింది.

**తుది జట్లు**

ఈస్ట్ జోన్: అభిమన్యు ఈశ్వరన్, వైభవ్ సూర్యవంశీ, కుమార్ కుషాగ్రా, సుదీప్ కుమార్ ఘరామి, శిఖర్ మోహన్, ఇషాన్ కిషన్(కెప్టెన్), మహ్మద్ కౌనైన్ ఖురైషి, అనుకుల్ రాయ్, మహమ్మద్ షమీ, అభిజిత్ కె సర్కార్, ముఖేష్ కుమార్
సౌత్ జోన్: రికీ భుయ్, నారాయణ్ జగదీషన్(వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, షేక్ రషీద్, తిలక్ వర్మ(కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, శ్రేయస్ గోపాల్, త్రిపురాన విజయ్, మహ్మద్ సిరాజ్, చామ వి మిలింద్, మహ్మద్ నిధీష్

# సాత్విక్‌చిరాగ్ జోడీ చరిత్ర..
## చైనా గోడను బద్దలుకొట్టి విజేతలుగా!




భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్‌చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో సాత్విక్‌చిరాగ్ ద్వయం 1121, 2113, 2117తో హెజి టింగ్‌రెన్ గ్జియాంగ్ జోడీపై విజయం సాధించింది. చైనా గోడను బద్దలుకొట్టిన ఈ జోడికి ఇదే తొలి చైనా మాస్టర్స్ టైటిల్ కావడం విశేషం.
గతంలో వరుసగా రెండుసార్లు (2023, 2025లో) రన్నరప్‌గా నిలిచిన సాత్విక్‌చిరాగ్ జోడీ మూడో దఫాలో మాత్రం చాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది సాత్విక్, చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కాగా, ఇటీవలే సింగపూర్ ఓపెన్ సూపర్750 టైటిల్‌ను గెలుచుకున్న సంగతి తెలిసిందే. అంతేకాదు థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలోనూ ఈ జంట ఫైనల్‌కు చేరింది.


**మ్యాచ్ జరిగింది ఇలా..**

మ్యాచ్ ఆరంభం నుంచి మంచి ఈజ్‌తో కనిపించినప్పటికీ సాత్విక్‌చిరాగ్ ద్వయం తొలి గేమ్‌ను కోల్పోయారు. అయితే రెండో గేమ్‌లో మాత్ర పుంజుకున్న ఈ జంట 2113తో చైనా జోడికి చెక్ పెట్టారు. ఇక కీలకమైన మూడో గేమ్‌లో మాత్రం మొదట తడబడడంతో ఈసారి కూడా రన్నరప్‌కే పరిమితమవుతారేమోననిపించింది. ఒక దశలో 119తో వెనుకబడిన సాత్విక్ జంట విజృంభించి 1616తో స్కోరును సమం చేసింది. ఈ దశలో ఒక్కసారిగా చెలరేగిపోయిన సాత్విక్, చిరాగ్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా 2117తో గేమ్‌ను ముగించడంతో పాటు మ్యాచ్‌ను గెలిచారు. 2023, 2025 సీజన్లలో ఫైనల్‌కు చేరినప్పటికీ రన్నరప్‌కే పరిమితమైన సాత్విక్, చిరాగ్ ద్వయం ఈసారి మాత్రం టైటిల్ గెలుపే లక్ష్యంగా ఆటను కొనసాగించారు. ఇన్నాళ్లు చైనా ఫోబియాను ఎదుర్కొన్న ఈ జంట అన్ని అనుమానాలను పటాపంచలు చేస్తూ చాంపియన్స్‌గా నిలిచారు.

# కౌంటీల్లో చెలరేగుతున్నాడు;
## సెలెక్టర్లకు చెన్నై చిన్నోడి వార్నింగ్!



కౌంటీ క్రికెట్‌లో తమిళనాడు క్రికెటర్ సాయి కిషోర్ తన ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. గ్లౌసెస్టర్‌షైర్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నై స్పిన్నర్ సాయి కిషోర్ అద్భుత బౌలింగ్‌తో తన జట్టును గెలిపించడంలో కీలక పాత్ర పోషించాడు. డెర్బీషైర్‌తో జరిగిన మ్యాచ్‌లో సాయి కిషోర్ 20 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టడంతో గ్లౌసెస్టర్‌షైర్ 213 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.
ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసిన సాయి కిషోర్ (తొలి ఇన్నింగ్స్‌లో రెండు, రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు) డెర్బీషైర్ పాలిట సింహస్వప్నమయ్యాడు. అతడి ధాటికి 319 పరుగుల ఛేదనలో తడబడిన డెర్బీషైర్ 105 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో సాయి కిషోర్ 18 ఓవర్లు వేస్తే అందులో 12 మెయిడెన్ ఓవర్లు కావడం విశేషం.
దేశవాళీలో ఇటీవలి రంజీ ట్రోఫీలో నిలకడను ప్రదర్శించిన సాయి కిషోర్ కౌంటీ క్రికెట్లోనూ అదే జోరును చూపిస్తున్నాడు. తాజాగా తన ప్రదర్శనతో సాయి కిషోర్ బీసీసీఐ సెలెక్టర్లకు తన ఎంపిక గురించి హెచ్చరికలు పంపాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు, ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా ఉండటం, ఇంగ్లండ్ పరిస్థితుల్లోనూ రాణించే సామర్థ్యం.. ఇవన్నీ అతడికి కలిసొచ్చే అంశాలని చెప్పొచ్చు. సీనియర్ల వీడ్కోలుతో భారత టెస్టు జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉంది. సీనియర్ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యువ ప్లేయర్ల కోసం టీమ్ మేనేజ్‌మెంట్ చూస్తోంది. ఈ నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో భారత టెస్టు జట్టు భవిష్యత్తు ప్రణాళికల్లో సాయి కిశోర్ కీలక ఎంపికగా మారే అవకాశం ఉంది. అతడి బౌలింగ్ శైలి కూడా గంభీర్ విధానాలకు తగినట్లుగా ఉండడం ఆసక్తికర విషయం. రాబోయే రోజుల్లో టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో టెస్టు సిరీస్‌లు ఆడనుంది. మరి కౌంటీల్లో అద్భుత ప్రదర్శన చేస్తున్న సాయి కిషోర్ టీమిండియాకు ఎంపికవుతాడా లేదా అనేది చూడాలి.



## అల్లు అర్జున్ రాకా.. ప్రముఖ నటుడి రోల్ రివీల్..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తోన్న భారీ యాక్షన్ మూవీ రాకా. ఈ సినిమాకు అల్లు అర్జున్ దర్శకత్వం వహిస్తున్నారు. తొలిసారి వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ మూవీ షూటింగ్ ముంబయిలో పూర్తి చేసుకుంది. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు పృథ్వీరాజ్(బబ్లూ) కీలక పాత్ర పోషిస్తున్నట్లు క్లారిటీ ఇచ్చేశాడు. తాజా ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో తనకు ఒక ప్రత్యేకమైన లుక్‌తో కూడిన కీలక పాత్ర దక్కిందని రివీల్ చేశారు. దర్శకుడు అట్లీతో కలిసి పనిచేయడం అదృష్టమని.. అంతేకాకుండా అల్లు అర్జున్‌తో కలిసి పనిచేయడంతో తన కల సాకారమైందని స్పష్టం చేశారు. కాగా.. ఈ సినిమాలో దీపిక పదుకొణెతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా హీరోయిన్‌గా కనిపించనుంది. అంతేకాకుండా జాన్వీ కపూర్ నటిస్తోందని టాక్ వినిపిస్తోంది. ఈ మూవీని మాఫియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. ఈ మూవీలో బన్నీ డ్యూయల్ రోల్ చేయనున్నారని స్పష్టమవుతోంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

## బాలకృష్ణ 'NBK111' టైటిల్‌తో పాటు రిలీజ్ డేట్ కూడా ఫిక్స్.. పవర్ ఫుల్ పోస్టర్ వైరల్

మ్యాన్ ఆఫ్ మాసెస్ నందమూరి నటసింహం బాలకృష్ణ ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజింగ్ అప్డేట్ వచ్చేసింది. బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఓ బిగ్ ప్రాజెక్ట్ రాబోతున్నది. ప్రస్తుతం 'NBK111' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు మేకర్స్. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు.. వేలుకి ట్రిగర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్‌కి బలుపుఉండాలి... గన్స్‌కి గట్స్ ఉండాలి..!' అంటూ బాలకృష్ణ పవర్ ఫుల్ డైలాగ్‌తో వచ్చిన ఈ గ్లింప్స్‌లో 'దాదా' (DADA) అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అలాగే ఈ సినిమా ఈ ఏడాది క్రిస్మస్ స్పెషల్‌గా డిసెంబర్ 24న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలిపారు. కాగా.. 'వీరసింహారెడ్డి' వంటి సంచలన విజయం తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద దీనిపై భారీ హైప్ నెలకొంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పవర్ ఫుల్ యాక్షన్ డ్రామాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా అలరించనుండగా, విలన్‌గా మంచు మనోజ్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు.





## అక్కడి వాతావరణం మినీ కేరళలా అనిపించింది

యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ కలయికలో ఓ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'అంతా రాములోరు చూస్కుంటారు' అనే ఆకట్టుకునే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. తాజాగా 'అంతా రాములోరు చూస్కుంటారు' సినిమా టైటిల్ గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. 'మా మూవీ టైటిల్ గ్లింప్స్ మీకు నచ్చిందని నమ్ముతున్నాను. మా మూవీని కూడా థియేటర్స్‌లో ఎంజాయ్ చేస్తారు. సినిమాలోని ప్రతి సీన్ మీకు బాగా నచ్చుతుంది. ఈ సినిమాను గోదావరి జిల్లాల నేపథ్యంతో చేశాం. అక్కడి వాతావరణం చూస్తుంటే మినీ కేరళలా అనిపించింది. అక్కడ వాళ్లు చూపించే లవ్, దొరికే ఫుడ్ చాలా బాగున్నాయి. అక్కడి స్పెషల్ స్వీట్స్ టేస్ట్ చేశాం. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇంకా ఫినిష్ చేయాల్సిఉంది. మీరంతా మీ ఫ్యామిలీ మెంబర్స్ తో కలిసి థియేటర్స్‌కు వచ్చి ఈ సినిమాను ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా. ఈ చిత్రంలోని శిరీష, మారుతి క్యారెక్టర్స్ ను మీరు ప్రేమిస్తారని ఆశిస్తున్నాం' అని చెప్పకొచ్చింది. అలాగే మెగాస్టార్ చిరంజీవి 'కాకా' సినిమా గురించి మాట్లాడుతూ.. 'మెగాస్టార్ చిరంజీవి గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం నాకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. 'కాకా' సినిమాను థియేటర్లలో ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు, ముఖ్యంగా మెగాస్టార్ అభిమానులకు ఈ చిత్రం బాగా నచ్చుతుంది' అని ఆనందం వ్యక్తం చేసింది. కాగా.. ఈ చిత్రాన్ని శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్, వి.జి.బి. ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్స్‌పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ రూపొందిస్తున్నారు.





## ఇదొక రూటెడ్ అండ్ రస్టిక్ సినిమా.. తమ్ముడు కొడుకు సినిమాపై రవితేజ కామెంట్స్

హీరో రవితేజ సోదరుడు రఘు కుమారుడు మాధవ్ భూపతిరాజు 'మారెమ్మ' చిత్రంతో హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. మంచాల నాగరాజు దర్శకత్వంలో మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బంగారు నిర్మిస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ 10న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే తాజాగా సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు టీమ్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవితేజ ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'నేను 'మారెమ్మ' సినిమా చూశాను. చాలా రూటెడ్ అండ్ రస్టిక్‌గా ఉంది. రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తెరకెక్కించిన ఈ మూవీ నాకు చాలా చాలా బాగా నచ్చింది. డెఫినెట్‌గా ప్రేక్షకులకు కూడా బాగా నచ్చుతుంది. నాగరాజుకు ఇది మొదటి సినిమా అయినప్పటికీ చాలా అద్భుతంగా దర్శకత్వం వహించారు. ఇలాంటి సబ్జెక్ట్‌ను మాధవ్‌తో చేయడం చాలా బాగుంది. తమ్ముడు మాధవ్ బాగున్నాడు. మాధవ్ తన ట్రాన్స్‌ఫర్మేషన్‌ను పర్ఫెక్ట్‌గా చూపించాడు' అంటూ ప్రశంసలు కురిపించాడు. ఇక హీరో మాధవ్ భూపతి రాజు మాట్లాడుతూ.. 'ఫస్ట్ అన్నయ్యకే థాంక్యూ చెప్పాలి అనుకుంటున్నాను.. ఎందుకంటే చిన్నప్పటి ఆయన్ని, ఆయన సినిమాలను చూస్తూ పెరిగాను. అలాంటిది ఆయన నా ఫస్ట్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు రావడం, నా ముందు ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఈ మూమెంట్‌ని ఎలా చెప్పాలో కూడా నాకు అర్థం కావడం లేదు. లవ్ యూ అన్నయ్య (రవితేజ). ఆయన నాకు పెద్దనాన్న కాదు అన్నయ్య. అందరూ కూడా అదే ఫిక్స్ అవ్వండి' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

## గ్రామీణ ప్రపంచంలో సరికొత్త ఉల్లాసం.. SYG నుంచి హీరోయిన్ స్పెషల్ పోస్టర్ రిలీజ్


మెగా హీరో సాయి ధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. 'హనుమాన్' లాంటి బ్లాక్ బస్టర్ సినిమాతో ఇండియాన్ షేక్ చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ విజువల్ వండర్‌లో యంగ్ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం నుంచి హీరోయిన్ పాత్రను రివీల్ చేశారు మేకర్స్. ఈ మేరకు హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి బర్త్‌డే కావడంతో ఆ స్పెషల్‌గా ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'సంబరాల ఏటిగట్టు బృందం తరపున ఐశ్వర్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు. 'వసంత'గా, ఆమె ఆ గ్రామీణ ప్రపంచంలో సరికొత్త ఉల్లాసాన్ని, ఆప్యాయతను నింపుతుంది' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ SYG 2027 జనవరి 12న విడుదల కాబోతున్నట్లు ఈ సందర్భంగా మరోసారి క్లారిటీ ఇచ్చారు మేకర్స్.





## హీరోగా ఎంట్రీ ఇస్తున్న ప్రముఖ నటుడు శరత్ బాబు కొడుకు

ప్రముఖ నటుడు శరత్ బాబు కుమారుడు ఆయుష్ తేజస్ హీరోగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి కట్టా జయ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన సీహెచ్ దివ్య నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నానిషా హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర పూజా కార్యక్రమం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రానికి క్లాప్ కొట్టి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు కట్టా జయ్ మాట్లాడుతూ.. 'మా చిత్రం గ్రాండ్‌గా అన్నపూర్ణా స్టూడియోస్‌లో ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. శరత్ బాబు గారి కుమారుడు ఆయుష్ తేజస్ మా సినిమాలో హీరోగా నటించడం ఎంతో సంతోషంగా ఉంది. మా సినిమా ప్రారంభోత్సవానికి విచ్చేసి క్లాప్ కొట్టిన వి.వి. వినాయక్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే మా తొలి ప్రెస్ మీట్‌కు విచ్చేసిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు. ఇది మా డెబ్యూ మూవీ. ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతున్నారు. ప్రేక్షకులు, మీడియా మా సినిమాను ఆదరించి, ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను'అన్నారు. హీరో ఆయుష్ తేజస్ మాట్లాడుతూ..'మా సినిమా కథపై పూర్తి నమ్మకంతో, ఒక గొప్ప విజయాన్ని సాధిస్తామని విశ్వసిస్తున్నాం. మా సినిమా ప్రారంభోత్సవానికి విచ్చేసి క్లాప్ కొట్టిన వి.వి. వినాయక్ సార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఆయన చేతుల మీదుగా మా సినిమా ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉంది. ఇది మా టీమ్‌కు సంబంధించిన తొలి ప్రెస్ మీట్. మీడియా మిత్రులకు, ప్రేక్షకులకు నా ధన్యవాదాలు. మా సినిమాను అందరూ ఆదరించి, సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు.



## మారి సెల్వరాజ్ 'మంజనతి' సినిమాలో మరో యంగ్ బ్యూటీ?

పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు మారి సెల్వరాజ్ ప్రస్తుతం రెండు పెద్ద ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఒకవైపు ధనుష్‌తో 'D-56' చేస్తుండగా, మరోవైపు విభిన్నమైన కాన్సెప్ట్‌తో 'మంజనతి' చిత్రాన్ని పట్టాలెక్కించారు. ఈ సినిమాకు సంగీత దిగ్గజం ఇళయరాజా స్వరాలు అందిస్తుండటం విశేషం. ఈ లేడీ ఓరియంటెడ్ ఎమోషనల్ డ్రామాలో ప్రియాంక మోహన్, కాయదు లోహర్ హీరోయిన్లుగా నటిస్తుండగా, కథిర్ మరియు పొన్‌వేల్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఫార్చ్యూన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుశాంత్ ప్రసాద్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రముఖ ఆనంద వికటన్ వారపత్రికలో ప్రచురితమై పాపులర్ అయిన ఒక సుప్రసిద్ధ ధారావాహిక ఆధారంగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారట. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ రాగా, రోజుకో వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. తాజాగా ఈ సినిమాలో పూర్ణిమ రవి ఒక కీలక పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తోంది. యూట్యూబ్‌లో 'ఆరాత్తి' అనే కామెడీ ఛానెల్ ద్వారా వీడియోలు చేస్తూ డిజిటల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న పూర్ణిమ.. ఆ తర్వాత చిన్న చిన్న షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తూ తనలోని నటనా ప్రతిభను నిరూపించుకుంది. బిగ్ బాస్ తమిళ సీజన్-7లో కంటెస్టెంట్‌గా అవకాశం దక్కించుకుంది. 'ప్లాన్ పన్ని పణ్ణనుమ్', నయనతార నటించిన 'అన్నపూరణి, 'సెవప్పి' వంటి చిత్రాల్లో ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటించి మెప్పించింది. ఇక ఇప్పుడు ఏకంగా మారి సెల్వరాజ్ సినిమాలో చాన్స్ దక్కించుకోవడంతో అందరి దృష్టి ఈ అమ్మడుపై పడింది.

Edited, Printed and Owned by PALA SWATHI, Printed at SAKETH PUBLICATIONS, # 5-1-87/4/B/1, SIDDARTHA NAGAR, TELANGANA - 502001. Published From Plot.NO. 15, Sai Krupa Nagar, Beside SUNRISE HOSPITALSANGAREDDY, TELANGANA - 502001. Editor PALA SWATHI, RNI Regn. No. TGTEL/26/A3311, Cel: 87902 88333